www.vaarthavedhikasurya.com
PRGI.NO:- TGTEL/25/A0305
# వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

## ఇజ్రాయెల్-లెబనాన్ మధ్య కాల్పుల విరమణ



2 లో..


| యాదాద్రి భువనగిరి YADADRI BHUVANAGIRI | సంపుటి: 1 VOLUME : 1 | సంచిక: 321 ISSUE : 321 | శుక్రవారం, 17 ఏప్రిల్, 2026 FRIDAY, APRIL 17, 2026 | ఎడిటర్: పోలోజు శ్రీనివాసచారి EDITOR : POLOJU SRINIVASA CHARY | పేజీలు: 8 PAGES : 8 | వెల: 5-00 RS : 5-00 |
|---|---|---|---|---|---|---|

# ఎవరికీ అన్యాయం జరగదు

## ఏ రాష్ట్రానికీసీట్ల శాతం తగ్గదు!

### కోటాను వ్యతిరేకిస్తే మహిళా ప్రపంచం క్షమించదు..

- మీరే నష్టపోతారు.. విపక్షాలకు ప్రధాని హెచ్చరిక
- చట్టసభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్, లోక్‌సభ నియోజకవర్గాలు 50 శాతం పెంపు బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం
- ఆంధ్రప్రదేశ్‌లో 25 నుంచి 38కి, తెలంగాణలో 17 నుంచి 26కు పెరుగుతాయ్
- తమిళనాడు 39-59, కర్ణాటక 28-42, కేరళ 20-30
- అన్ని రాష్ట్రాలకూ 50 శాతం సీట్లు పెంచుతున్నాం
- దక్షిణాది రాష్ట్రాలకు 50 శాతం మించి పెరుగుతాయి
- తెలంగాణ, ఏపీ, తమిళనాడుకు తలా 0.05 శాతం అదనం
- లోక్‌సభకు వివరించిన హోంమంత్రి అమిత్‌షా
- 12 గంటల చర్చ.. నేటి సాయంత్రం 4 గంటలకు ఓటింగ్
- బిల్లు ప్రవేశపెట్టినప్పుడూ ఓటింగ్‌కు పట్టుబట్టిన విపక్షం
- 104 మంది గైర్హాజరు.. తేలిగ్గా నెగ్గిన సర్కారు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:** మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తే మహిళా ప్రపంచం క్షమించదని ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిపక్షాలను హెచ్చరించారు. లోక్‌సభ సీట్లను పెంచడం వల్ల రాష్ట్రాలకు ప్రస్తుతం లభించే సీట్ల శాతంలో ఎలాంటి మార్పూ ఉండదని ప్రధాని హామీ ఇచ్చారు. అన్ని రాష్ట్రాలకూ లోక్‌సభలో 50 శాతం సీట్లు పెరుగుతాయని, దక్షిణాది రాష్ట్రాలకు గతంలో కంటే ఎక్కువ శాతం సీట్లు లభిస్తాయని కేంద్ర హోంమంత్రి ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌కు 25 నుంచి 38కి, తెలంగాణకు 17 నుంచి 26కు పెరుగుతున్నాయని సభాముఖంగా వెల్లడించారు. లోక్‌సభలో గురువారం చరిత్రాత్మకమైన మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్ బిల్లులను ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అనంతరం ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోం మంత్రి అమిత్ షా ఈ బిల్లులపై ప్రతిపక్షాల్లో నెలకొన్న భయాందోళనలను తొలగించేందుకు ప్రయత్నించారు. దాదాపు 12 గంటల పాటు ఈ బిల్లులపై చర్చ జరిగిన తర్వాత శుక్రవారం సాయంత్రం 4 గంటలకు కీలకమైన ఓటింగ్ జరుగుతుందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. గురువారం కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ బిల్లులను ప్రవేశపెట్టిన తర్వాత మోదీ, అమిత్ షాలతో పాటు సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్, కాంగ్రెస్ ఎంపీలు ప్రియాంకాగాంధీ, కేసీ వేణుగోపాల్, గౌరవ్ గొగోయ్, డీఎంకే నేత ఎ.రాజా, తెలుగుదేశం ఎంపీ బైరెడ్డి శబరి, శివసేన(యూబీటీ) నేత, బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య ప్రసంగించారు. మహిళా బిల్లును తిప్పి గొట్టేందుకు ప్రతిపక్షాలు దురుద్దేశ పూరితంగా వ్యవహరిస్తే మహిళలు గమనిస్తున్నారన్న విషయం మరిచిపోరాదని ప్రధాని మోదీ హెచ్చరించారు. డీలిమిటేషన్‌ను ఉత్తర దక్షిణ ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టడానికి ఉపయోగించుకోవడం సరైనది కాదని అన్నారు. లోక్‌సభలో సీట్ల పెంపు తర్వాత అన్ని రాష్ట్రాలకు లభించే సీట్ల శాతంలో ఎలాంటి మార్పూ ఉండదని స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్‌ను ఇంకెంత మాత్రం జాప్యం చేయకూడదని, ఇప్పటికే వారికి చాలా అన్యాయం జరిగిందని చెప్పారు. సాంకేతిక కారణాలు, ఏవో నెపాలు చూపిస్తూ మహిళలను మోసం చేయరాదని విజ్ఞప్తి చేశారు. బిల్లు ఆమోదం పొందితే ఘనత దక్కించుకోవాలని తాను భావించడంలేదని, ఆమోదం పొందకపోతేనే తనకు మిగతా 2లో..

## దక్షిణాది రాష్ట్రాలకే లాభం: అమిత్‌షా (కేంద్ర హోంమంత్రి)

డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు లాభమే తప్ప ఎలాంటి నష్టం జరగదని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అన్నారు. దక్షిణాదిలో ఉన్న జనాభా కంటే ఎక్కువ సీట్లు లభిస్తాయని, ఎక్కడ అన్యాయం జరుగుతుందో చె ప్పాలని నిలదీశారు. తాము అన్ని రాష్ట్రాలకు దాదాపు 50 శాతం మేరకు సీట్లు పెంచాలని నిర్ణయించినట్లు ఆయన అధికారికంగా వెల్లడించారు. దక్షిణాది రాష్ట్రాలకు ప్రస్తుతం లోక్‌సభలో 129 మంది సభ్యులున్నారని, వారి సంఖ్య 195 సీట్లకు పెరుగుతుందని వివరించారు. లోక్‌సభలో దక్షిణాది ప్రాతినిధ్యం 23.76 శాతం నుంచి 23.97 శాతానికి(0.21 శాతం) పెరుగుతుందన్నారు. డీలిమిటేషన్ తర్వాత ఆంధ్రప్రదేశ్ లోక్‌సభ సీట్లు 25 నుంచి 38కి, తెలంగాణ లోక్‌సభ సీట్లు 17 నుంచి 26కు, కర్ణాటక సీట్లు 28 నుంచి 42కు, తమిళనాడు సీట్లు 39 నుంచి 59కి, కేరళ సీట్లు 20 నుంచి 30కి పెరుగుతాయని వివరించారు. ఏపీకి 4.6 శాతం నుంచి 4.65 శాతానికి(0.05 శాతం అదనం), తెలంగాణకు 3.13 శాతం నుంచి 3.18 శాతానికి(0.05 శాతం అదనం) తమిళనాడుకు 7.18 శాతం నుంచి 7.23 శాతానికి(0.05 శాతం అదనం) వాటా పెరుగుందని వివరించారు. కర్ణాటకకు 5.15 శాతం నుంచి 5.14 శాతానికి (0.01 శాతం తక్కువ) కేరళకు 3.68 శాతం నుంచి 3.67 శాతానికి(0.01 శాతం తక్కువ) వాటా అత్యంత స్వల్పంగా తగ్గుతుందని హోంమంత్రి చెప్పారు. దక్షిణాది రాష్ట్రాల వాటా 23.76 శాతం నుంచి 19 శాతానికి తగ్గుతుందని విపక్షాలు ప్రచారం చేశాయని, తాము 24 శాతానికి పెంచుతున్నామని చెప్పారు. తాము కులగణనను వ్యతిరేకిస్తున్నామన్నది సరైంది కాదని, జనగణనలో భాగంగా కులగణన కూడా చేస్తామని ప్రకటించారు. ఏ ప్రాంతానికీ సీట్ల విషయంలో నష్టం జరగదని చెప్పారు. కావాలంటే కేజీ పిల్లలకు కూడా అర్థమయ్యే విధంగా చెప్పడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు.



# లోక్‌సభ సీట్ల పెంపునకు రంగం సిద్ధం

- లోక్‌సభ సీట్లు 816.. 50% ఫార్ములా..
- దీని ఆధారంగానే నియోజకవర్గాల పునర్విభజన
- నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్లు, యూటీల్లో సీట్ల పెంపునకు సంబంధించిన మూడు కీలక బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్రం





**న్యూఢిల్లీ/హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-ఏప్రిల్ 16:** దేశంలో లోక్‌సభ సీట్ల పెంపునకు రంగం సిద్ధమైంది. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్లు, యూటీల్లో సీట్ల పెంపునకు సంబంధించిన మూడు కీలక బిల్లులను కేంద్రం గురువారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. ప్రస్తుతం 543గా ఉన్న లోక్‌సభ స్థానాలు డీలిమిటేషన్ తర్వాత 816కు చేరనున్నట్టు తెలిపింది. మొత్తం లోక్‌సభ సీట్లలో 272 స్థానాలను మహిళలకు కేటాయించనున్నట్టు వెల్లడించింది. నియోజకవర్గాల పునర్విభజన కారణంగా ఏ రాష్ట్రమూ నష్టపోదని ప్రధానమంత్రి మోదీ హామీనిచ్చారు. తమకు ఏ రాష్ట్రంపై వివక్ష లేదని పేర్కొన్నారు. 50 శాతం ఫార్ములా ఆధారంగా చేసే డీలిమిటేషన్‌తో దక్షిణాదికి లోక్‌సభలో ప్రాతినిధ్యం మరింతగా పెరగనున్నట్టు కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. ఈ మూడు కీలక బిల్లులపై శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ఓటింగ్ నిర్వహించనున్నట్టు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగబోతున్నదని ప్రతిపక్ష ఎంపీలు లోక్‌సభ ప్రారంభంలోనే నిరసనలకు దిగారు. మూడు బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టే కంటే ముందు డివిజన్ ఆఫ్ ఓటును నిర్వహించాలని స్పీకర్ ఓం బిర్లాకు విజ్ఞప్తి చేశారు. విపక్షాల కోరిక మేరకు ఓటింగ్ నిర్వహించగా.. బిల్లుల ప్రవేశానికి అనుకూలంగా 251 మంది ఓటేయగా, మిగతా 2లో..



## ఫిరాయింపు ఎమ్మెల్యేలకు హైకోర్టు నోటీసులు

- 3 వారాల్లో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశం

# ప్రపంచవ్యాప్తంగా ‘మేడిన్ తెలంగాణ’ మార్క్

- అమెరికాకు దీర్ఘకాలిక వ్యూహాత్మక భాగస్వామిగా తెలంగాణ
- ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



**హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-ఏప్రిల్ 16:** రాకెట్ల నుంచి అత్యాధునిక డ్రోన్ల వరకు, యుద్ధ విమానాల విడి భాగాల నుంచి శాటిలైట్ల వరకు అన్నింటా.. ‘మేడిన్ తెలంగాణ’ మార్క్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తమైందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా దూసుకెళ్తున్న రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని గురువారం సచివాలయంలో జరిగిన అమెరికాకు చెందిన నేషనల్ కాలేజ్ వార్ బృంద సభ్యులతో జరిగిన సమావేశంలో కోరారు. ప్రిసిషన్ ఇంజనీరింగ్, డ్రోన్లు, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 1,500 కంటే ఎక్కువ ‘తెలంగాణ బ్రాండ్’ను విశ్వవ్యాప్తం చేస్తున్నాయన్నారు. ఫైనాన్షియల్ టైమ్స్ ఎఫ్‌డీఏ ర్యాంకింగ్స్ ప్రకారం, ప్రపంచంలోనే అత్యంత ‘కాస్ట్ ఎఫెక్టివ్ ఏరోస్పేస్ సిటీ’గా హైదరాబాద్ తొలి స్థానంలో నిలిచిందన్నారు. మిగతా 2లో..

## ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ పరీక్ష రద్దు

- ఈ నెల 27న తిరిగి పరీక్ష నిర్వహణ

**వరంగల్, (వార్త వేదిక సూర్య)-ఏప్రిల్ 16:** కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ జనరల్ సర్జరీ పేపర్-1 పరీక్షను రద్దు మిగతా 2లో..

# పార్లమెంట్ సాక్షిగా తెలంగాణపై విషం కక్కిన బిజెపి

- ఆ పార్టీ ఎంపీ తేజస్వీ తీవ్ర వ్యాఖ్యలు
- అవమానిస్తున్నా ఎంపీలు నోరుమెదకపోవడం బాధాకరం
- ఢిల్లీలో తెలంగాణ ఆత్మగౌరవం తాకట్టు
- తేజస్వీ, బీజేపీ బేషరతుగా క్షమాపణలు చెప్పాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్

తెలంగాణ ఆవిర్భావంపై పార్లమెంట్ సాక్షిగా బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య విషం కక్కడం అత్యంత దుర్మార్గం. నాడు ప్రధాని మోదీ, ఇప్పుడు ఇతర బీజేపీ నాయకులు పదేపదే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, అమరుల త్యాగాలను అవమానిస్తూనే ఉన్నారు. తేజస్వీ వ్యాఖ్యలతో బీజేపీ కుసంస్కారం బయటపడింది. ఆ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా. తేజస్వీ, బీజేపీ బేషరతుగా నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలి.
– కేటీఆర్ (బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ )



**హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-ఏప్రిల్ 16:** తెలంగాణ ఏర్పాటుపై పార్లమెంట్ సాక్షిగా బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటుగా స్పందించారు. తెలంగాణపై పార్లమెంట్ సాక్షిగా మరోసారి విషం చిమ్మిందని గురువారం ఎక్స్ వేదికగా ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్యంలో అత్యున్నత వేదికైన లోక్‌సభలో బీజేపీ నేతలు తెలంగాణ ఆవిర్భావంపై ద్వేషాన్ని వెళ్లగక్కడం దుర్మార్గమని, తేజస్వీ మిగతా 2లో..

సంపుటి: 1 సంచిక: 321 వార్త వేదిక సూర్య || శుక్రవారం, 17 ఏప్రిల్, 2026 ||

# ఏ రాష్ట్రానికి అన్యాయం జరగదు

(మొదటి పేజీ తరువాయి)

ప్రయోజనకరమని అన్నారు. మహిళా రిజర్వేషన్‌ను అందరూ ఆమోదిస్తే వార్తా పత్రికల్లో అందరి ఫోటోలు తన ఖర్చుతో వేయిస్తానని చెప్పారు. ఈ నిర్ణయం వల్ల ఎవరి పట్లా అన్యాయం కానీ వివక్ష కాని జరగదని హామీ ఇచ్చారు. ఉద్దేశం మంచిదైనప్పుడు పదాలతో ఆడుకోకూడదని విపక్షాలకు విజ్ఞప్తి చేశారు. మహిళా కోటాలో ఓబీసీలకు వాటా డిమాండ్‌పై ప్రధాని మోదీ స్పందిస్తూ, తాను కూడా ఓబీసీనేనని, రాజ్యాంగ ప్రకారం అందరికీ న్యాయం చేయాలన్నదే తన ఉద్దేశమని చెప్పారు. లోక్‌సభ సీట్ల పెంపు, మహిళలకు రిజర్వేషన్ గురించి తాము ముందుగానే ఆలోచించామని, అందుకే అందరికీ చోటు కల్పించేందుకు కొత్త పార్లమెంట్‌ను విశాలంగా నిర్మించామని అన్నారు.

**ప్రాతిపదిక ఏమిటి?: వేణుగోపాల్ (కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి)**

850 సీట్లు ఏ ప్రాతిపదికన పెంచుతున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రశ్నించారు. 50 శాతం పెంచాలన్నది బిల్లులో ఎక్కడుందని నిలదీశారు. 2029 ఎన్నికల్లో గెలిచేందుకే డీలిమిటేషన్‌ను ఒక వ్యూహంగా తీసుకొచ్చారని ఆరోపించారు. ఈ బిల్లుపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తే తాము సలహాలిస్తామన్నారు. బిల్లును ఏకాభిప్రాయ సాధన ద్వారా ఆమోదించాలని సూచించారు. తొమ్మిదేళ్లుగా బిల్లును ఎందుకు ఆలస్యం చేశారని ప్రశ్నించారు. ఇప్పుడేదో ఆలస్యం జరుగుతోందని ప్రధాని ఎందుకు వాపోతున్నారని అడిగారు. మహిళా రిజర్వేషన్‌ను ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసేందుకు వ్యూహంగా వాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ మహిళా రిజర్వేషన్‌కు అనుకూలమేనని కేసీ వేణుగోపాల్ అన్నారు. దేశానికి మొదటి మహిళా రాష్ట్రపతిని, మొదటి మహిళా ప్రధానిని, మెదటి మహిళా స్పీకర్‌ను కాంగ్రెసే అందించిందని గుర్తు చేశారు. మహిళా రిజర్వేషన్‌పై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని సోనియాగాంధీ ఎన్నోసార్లు ప్రస్తుత ప్రభుత్వానికి లేఖలు రాశారని ప్రస్తావించారు. ఎన్నికలయ్యే వరకు ఆగి ఈ సమావేశం ఏర్పాటు చేస్తే కొంపలు మునిగేదేముందని ప్రశ్నించారు. ఒక్క పది రోజులు ఆగలేక పోయారా? అన్నారు. తమిళనాడు, బెంగాల్ ఎంపీలు లేకుండా బిల్లులు ఆమోదించాలనే ప్రయత్నం జరుగుతోందని, ప్రతిపక్షాలను మహిళల వ్యతిరేకులుగా చిత్రించాలనుకుంటున్నారని విమర్శించారు. గతంలో డీలిమిటేషన్ జరిగినపుడల్లా ఏకాభిప్రాయ సాధన ద్వారా జరిగిందని గుర్తు చేశారు. బిల్లును ప్రస్తుత రూపంలో ఆమోదించడం కుదరదని అన్నారు.



# లోక్‌సభ సీట్ల పెంపునకు రంగం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

వ్యతిరేకిస్తూ.. 185 మంది సభ్యులు ఓటేశారు. దీంతో 131 రాజ్యాంగ సవరణ బిల్లు, డీలిమిటేషన్ బిల్లు, యూటీ సవరణ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. అనంతరం బిల్లులపై వాడీవేడి చర్చ సాగింది.

అఖిలేశ్-షా వాగ్వాదం

మహిళా రిజర్వేషన్లతో ముడిపడిన నియోజకవర్గాల పునర్విభజన బిల్లుపై గురువారం లోక్‌సభలో జరిగిన చర్చ సందర్భంగా ముస్లిం మహిళలకు రిజర్వేషన్ల విషయంలో సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిన తర్వాత ముస్లిం మహిళలకు విడిగా రిజర్వేషన్లు దక్కాలని అఖిలేశ్ డిమాండ్ చేశారు. తమ పార్టీ కుల గణనను కోరుకుంటున్నదని ఆయన చెప్పారు. దీనికి అమిత్ షా స్పందిస్తూ జనగణన ప్రక్రియ ఇదివరకే ప్రారంభమైందని చెప్పారు. ప్రస్తుతం ఇండ్ల గణన జరుగుతున్నదని, జన గణన జరిగినపుడు అందులో కులానికి సంబంధించిన ప్రస్తావన చేర్చుతామని అమిత్ షా చెప్పారు. మత ఆధారిత రిజర్వేషన్ల ఆలోచనను ఆయన తిరస్కరించారు. మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వడం ఆమోదయోగ్యం కాదని, మతపరమైన కారణాలతో ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని అమిత్ షా అన్నారు. సమాజ్‌వాదీ పార్టీపై పరోక్షంగా విమర్శలు గుప్పిస్తూ తన పార్టీ టికెట్లన్నీ అఖిలేశ్ యాదవ్ ముస్లిం మహిళలకే ఇవ్వవచ్చని, అలాంటప్పుడు ఆయన పార్టీకి సమస్య ఎక్కడ ఉందని షా ప్రశ్నించారు.తెలంగాణ సమాచారం మహిళా రిజర్వేషన్ బిల్లు వల్ల ఏ వ్యక్తి గానీ ఏ రాష్ట్రం గానీ ప్రతికూలంగా ప్రభావితం కాబోదని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ గురువారం లోక్‌సభకు తెలియజేశారు. మహిళలకు వారి హక్కులను కల్పించడమే ఈ బిల్లు ప్రధాన లక్ష్యమని మేఘ్వాల్ అన్నారు. మూడింట ఒక వంతు కోటాను ఏకరీతిగా అమలు చేసేందుకు లోక్‌సభను విస్తరించడంపైనే ఈ ప్రణాళిక ఆధారపడి ఉందని మంత్రి అన్నారు. దీనితో సభ బలం 50 శాతం పెరిగి 815 సీట్లకు చేరుతుందని, వాటిలో 272 సీట్లు మహిళలకు రిజర్వ్ అవుతాయని ఆయన చెప్పారు.

**ప్రజాస్వామ్యంపై బీజేపీ బహిరంగ దాడి: ప్రియాంక**

ఎన్నికల కమిషన్(ఈసీ), న్యాయవ్యవస్థ వంటి సంస్థలపై ఒత్తిడి తేవడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని అంతం చేయడం ప్రారంభించిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు రాజ్యాంగ సవరణ బిల్లుతో ప్రజాస్వామ్యంపై బహిరంగ దాడి ప్రారంభించిందని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా ఆరోపించారు. గురువారం మూడు బిల్లులపై లోక్‌సభలో జరిగిన చర్చలో పాల్గొంటూ లోక్‌సభలో ప్రస్తుతమున్న 543 సీట్లలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను ప్రభుత్వం ఎందుకు ఇవ్వలేదని ఆమె ప్రశ్నించారు. 2011 జనాభా లెక్కల డాటా ఆధారంగా డీలిమిటేషన్ కమిషన్ ద్వారా లోక్‌సభ సీట్ల సంఖ్యను 850 వరకు పెంచేందుకు ఈ బిల్లులో ప్రస్తావన ఉందని ఆమె చెప్పారు. పైకి చూస్తే ఇది బాగానే ఉన్నట్లు అనిపిస్తుందని, కానీ జాగ్రత్తగా చదివితేనే అసలు అర్థం బయటపడుతుందని, ఇందులో రాజకీయ ఛాయలు కనిపిస్తున్నాయని ప్రియాంక అన్నారు. నిబంధనలను క్షుణ్ణంగా పరిశీలిస్తే డీలిమిటేషన్ కమిషన్‌లోని ముగ్గురు సభ్యులే రాష్ట్రాల భవితవ్యాన్ని, పార్లమెంట్‌లో వాటి ప్రాతినిధ్యాన్ని నిర్ణయిస్తారని తెలుస్తుందని ఆమె చెప్పారు. అమిత్ షాను ఉద్దేశిస్తూ ఒకవేళ చాణక్యుడు ఇప్పుడు జీవించి ఉంటే మీ రాజకీయ చతురతకు (రాజనీతి కుటిలత) ఆయన ఆశ్చర్యపోయి ఉండేవారు. ఈ మొత్తం ప్రణాళికను ఆయనే(షా) రూపొందించారు. ఇప్పుడు నవ్వుతున్నారు. ఆయన నాతో ఏకీభవిస్తున్నారు అని ప్రియాంక వ్యాఖ్యానించారు.

'నారీ'ని 'నారా'గా మార్చేసిన బీజేపీ

అధికార బీజేపీ నారీ(మహిళ)ని నారా(నినాదం)గా మార్చేసిందని అఖిలేశ్ యాదవ్ గురువారం విమర్శించారు. జన గణను జాప్యం చేసేందుకే బీజేపీ మహిళా రిజర్వేషన్ చట్టానికి సవరణలు తీసుకువస్తున్నదని ఆయన అన్నారు. లోక్‌సభలో జరిగిన చర్చలలో అఖిలేశ్ పాల్గొంటూ తమ పార్టీ మహిళలకు రిజర్వేషన్లను ఎల్లప్పుడూ బలపరిచిందని చెప్పారు. ఆర్‌ఎస్‌ఎస్‌ను ఉద్దేశిస్తూ బీజేపీ మాతృసంస్థ అధినాయకత్వంలో ఎందరు మహిళలు ఉన్నారని ఆయన ప్రశ్నించారు. బీజేపీ, దాని మిత్రపక్షాలు అధికారంలో ఉన్న 21 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎంతమంది మహిళా ముఖ్యమంత్రులు ఉన్నారని ఆయన ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్‌ను డీలిమిటేషన్‌తో ముడిపెడుతూ లోక్‌సభ స్థానాల్ని పెంచడాన్ని కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ తప్పుబట్టారు. గురువారం కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లుపై గొగోయ్ మాట్లాడుతూ, ప్రతిపాదిత మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రస్తుత లోక్‌సభ సీట్ల సంఖ్య 543కు వర్తింపజేయాలని, భవిష్యత్ డీలిమిటేషన్‌తో ముడిపెట్టవద్దని అన్నారు.

**అమల్లోకి మహిళా రిజర్వేషన్ చట్టం**

చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు కల్పించే మహిళా రిజర్వేషన్ చట్టం 2023, గురువారం నుంచి అమల్లోకి వచ్చింది. ఈ మేరకు కేంద్ర న్యాయ శాఖ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. 2029లో అమలు చేసేందుకు అదే చట్టాన్ని సవరించాలని పార్లమెంట్‌లో చర్చ జరుగుతున్న క్రమంలో, ఈ 2023 చట్టాన్ని ఏప్రిల్ 16 నుంచి అమలులోకి వచ్చేలా ఎందుకు నోటిఫై చేశారో అన్న విషయం తెలియరాలేదు.

డీలిమిటేషన్‌కు సంబంధించి వెల్లువెత్తుతున్న అభ్యంతరాలపై స్పష్టతనిచ్చేందుకు లోక్‌సభలో గురువారం ప్రకటన చేస్తున్న ప్రధాని మోదీ

నియోజకవర్గాల పునర్విభజన బిల్లును వ్యతిరేకిస్తూ చెన్నైలో ముసాయిదా ప్రతులను తగులబెడుతున్న డీఎంకే అధినేత, సీఎం స్టాలిన్

**ప్రస్తుతం ఇలా**

లోక్‌సభలో మొత్తం సీట్లు = 543 (100%)
5 దక్షిణాది రాష్ట్రాల సీట్ల వాటా = 129 (23.76%)
మిగతా రాష్ట్రాల సీట్ల వాటా = 414 (76.24%)
దక్షిణాదికి మిగతా రాష్ట్రాల మధ్య సీట్ల అంతరం = 285

**డీలిమిటేషన్ తర్వాత**

లోక్‌సభలో మొత్తం సీట్లు: 816 (100%)
5 దక్షిణాది రాష్ట్రాల సీట్ల వాటా = 195 (23.89%)
మిగతా రాష్ట్రాల సీట్ల వాటా = 621 (76.11%)
దక్షిణాదికి మిగతా రాష్ట్రాల మధ్య సీట్ల అంతరం = 426

## ప్రపంచవ్యాప్తంగా 'మేడిన్ తెలంగాణ' మార్క్

(మొదటి పేజీ తరువాయి)

పెట్టుబడులతోపాటు సాంకేతికత, పరిశోధన, తయారీ, నైపుణ్యాభివృద్ధిలో అమెరికాకు నమ్మకమైన దీర్ఘకాల వ్యూహాత్మక భాగస్వామిగా నిలిచేందుకు 'తెలంగాణ' సిద్ధంగా ఉందని తెలిపారు. 'తెలంగాణ వంటి ప్రగతిశీల రాష్ట్రాలతో కలిసి పని చేసందుకు సిద్ధం. భవిష్యత్తులో ఆ దిశగా అడుగులు వేస్తాం. అమెరికా - తెలంగాణ మధ్య ద్వైపాక్షిక సహకారం పెంపుదలకు చొరవ చూపుతాం' అని స్టేట్ డిపార్ట్ మెంట్ మినిస్టర్ కౌన్సిలర్ పాల్ నరైన్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ప్రపంచ స్థాయి గ్లోబల్ కేపబుల్ సెంటర్ ఏర్పాటు చేయడానికి 'ప్రోటోల్యాబ్స్ టెక్నాలజీస్' ముందుకు వచ్చిందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. మంత్రితో సమావేశమైన ప్రోటోల్యాబ్స్ ప్రతినిధి బృందం తమ విస్తరణ కార్యక్రమాలను వివరించారు.

## ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ పరీక్ష రద్దు

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. ఈ విషయాన్ని గురువారం ఆరోగ్య విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణాధికారి తెలిపారు. ఈ పేపర్‌ను తిరిగి ఈ నెల 27న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బుధవారం జరిగిన పేపర్-1 పరీక్ష ప్రశ్నపత్రంలో 33 మార్కులకు సంబంధించిన ప్రశ్నలు పేపర్-2కు సంబంధించినవి రావడంతో విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పరీక్ష రద్దు ప్రకటన వెలువడింది. గతంలో కూడా పీజీ ఫోరెన్సిక్ విభాగంలో పాత ప్రశ్నలే తిరిగి ఇవ్వడంతో వివాదం తలెత్తింది.

## ఇజ్రాయెల్-లెబనాన్ మధ్య కాల్పుల విరమణ

**వాషింగ్టన్ డీసీ, ఏప్రిల్ 16:** ఇజ్రాయెల్-లెబనాన్ మధ్య 10 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. రెండు దేశాల దౌత్య ప్రతినిధులు వాషింగ్టన్ డీసీలో చర్చలు జరిపి కాల్పుల విరమణకు ఒప్పుకున్నారంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ట్రూత్ సోషల్‌లో పోస్ట్ పెట్టారు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు, లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్‌తో తాను మాట్లాడానని, ఇద్దరు నేతలూ కాల్పుల విరమణకు అంగీకరించారని వెల్లడించారు. ఇద్దరు నేతలను తాను వైట్‌హౌస్‌కు ఆహ్వానించానని తెలిపారు.






# వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన



- ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించండి: సిఐ రాఘవేందర్ రెడ్డి

**మహేశ్వరం ఏప్రిల్16 వార్త వేదిక సూర్య**

రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని మహేశ్వరం పోలీసు సీఐ రాఘవేందర్ రెడ్డి, పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన ఏఆర్‌ఆర్‌ఐవిఈ – ALIVE" (ఏఎల్‌ఐవిఈ) రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో వాహనాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో రోడ్డు ప్రమాదాలు కూడా అధికమవుతున్నాయని తెలిపారు. ప్రతి సంవత్సరం వేల సంఖ్యలో ప్రమాదాలు సంభవిస్తూ, ముఖ్యంగా అతివేగం కారణంగా ఎక్కువ మరణాలు జరుగుతున్నాయని అన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ వినియోగం, హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ వాడకపోవడం వంటి అంశాలు ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా ఉన్నాయని వివరించారు. రోడ్డు ప్రమాదాలు కేవలం సంఖ్యలు మాత్రమే కాకుండా కుటుంబాలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని పేర్కొంటూ, ప్రజలు బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని సూచించారు. ప్రభుత్వం సీసీ కెమెరాలు, ఈ-చలాన్లు, అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ, ప్రజల్లో క్రమశిక్షణ అవసరమని ఆయన అన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో సీట్ బెల్ట్ ఉపయోగించాలని, మద్యం సేవించి వాహనం నడపకూడదని, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగాన్ని పూర్తిగా నివారించాలని సూచించారు. ట్రాఫిక్ సిగ్నల్స్, వేగ పరిమితులను పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు.

## పార్లమెంట్ సాక్షిగా తెలంగాణపై విషం కక్కిన బిజెపి

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ వ్యతిరేక వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. బీజేపీ నేతలకు తెలంగాణ అస్తిత్వంపై ఏమాత్రం గౌరవం లేదనే విషయం రుజువైందని మండిపడ్డారు. రాష్ట్ర ఏర్పాటును భారత్-పాకిస్తాన్ విభజనతో పోల్చడం బీజేపీ మూర్ఖత్వానికి పరాకాష్ఠ అని విరుచుకుపడ్డారు. బీజేపీ నేతలు పదేపదే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారని ధ్వజమెత్తిన కేటీఆర్, అడుగడుగునా అమరుల త్యాగాలను అవమానిస్తున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు.ప్రధాని మోదీ మొదలు తాజాగా ఆ పార్టీ ఎంపీ తేజస్వీ సూర్య దాకా తెలంగాణపై అక్కసు వెళ్లగక్కుతున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణపై అదే పనిగా విషం కక్కుతున్నారని ధ్వజమెత్తారు. బీజేపీ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలను తెలంగాణ సమాజం గుర్తుపెట్టుకుంటుందని స్పష్టంచేశారు. ఎవరి దయాదాక్షిణ్యాలతోనో, ఎవరి భిక్షతోనో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకాలేదని, దశాబ్దాల సుదీర్ఘ పోరాటం.. వేలాది మంది యువకుల బలిదానాల ఫలితంగా తెలంగాణ విముక్తి పొందిందని ఆయన గుర్తుచేశారు. అస్తిత్వం, ఆత్మగౌరవం కోసం నాలుగుకోట్ల మంది ఏకమై చేసిన ప్రజాస్వామ్య పోరాటాన్ని దేశ విభజన లాంటి విషాదకర ఘటనలతో పోల్చడం ఎంతవరకు సమంజసమని కేటీఆర్ ప్రశ్నించారు. పార్లమెంట్ సాక్షిగా తెలంగాణపై విషం చిమ్ముతుంటే సభలో ఉన్న ఇక్కడి 16మంది బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు మౌనంగా ఉండటం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తంచేశారు. కనీసం ప్రతిపక్ష కాంగ్రెస్ ఎంపీలు సైతం తేజస్వీ వ్యాఖ్యలను ఖండించకపోవడం బాధాకరమని మండిపడ్డారు. తమ కండ్లముందే తెలంగాణను అవమానిస్తున్నా అడ్డుకోలేని వీళ్లు.. నాలుగుకోట్ల ప్రజలకు ఏం ముఖం చూపుతారని నిలదీశారు.

## ఫిరాయింపు ఎమ్మెల్యేలకు హైకోర్టు నోటీసులు

**హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-ఏప్రిల్ 16:**

పార్టీ ఫిరాయింపులకు సంబంధించి స్పీకర్ తీర్పును సవాలు చేస్తూ బీఆర్‌ఎస్ దాఖలు చేసిన పిటిషన్‌లపై మూడు వారాల్లో కౌంటర్లు దాఖలు చేయాలని సంబంధిత ఎమ్మెల్యేలకు గురువారం హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. బీఆర్‌ఎస్ తరఫున గెలిచి, కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన దానం నాగేందర్, పోచారం శ్రీనివాసరెడ్డి, కాలె యాదయ్య, కడియం శ్రీహరి, బండ్ల కష్ణమోహన్‌రెడ్డి, టి.ప్రకాశ్‌గౌడ్, అరికెపూడి గాంధీ, తెల్లం వెంకటరావు, సంజయ్‌కుమార్, గూడెం మహిపాల్‌రెడ్డిలపై దాఖలైన అనర్హత పిటిషన్‌లను కొట్టివేస్తూ స్పీకర్ తీర్పును వెలువరించారు. దీనిని సవాలు చేస్తూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు జి.జగదీశ్‌రెడ్డి, కె.పి.వివేకానంద, కె.సంజయ్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సీహెచ్.ప్రభాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డిలు దాఖలు చేసిన 10 పిటిషన్‌లపై హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌ల బెంచ్ గురువారం విచారణ చేపట్టింది. కౌంటర్ల దాఖలుకు మూడు వారాల సమయం ఇస్తూ విచారణను జూన్ 6కు వాయిదా వేసింది.




## శ్రీ స్వామినారాయణ గురుకుల్ ఇంటర్నేషనల్ స్కూల్, హైదరాబాద్

- సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో శ్రీ స్వామినారాయణ గురుకుల్ ఇంటర్నేషనల్ స్కూల్ చారిత్రాత్మక విజయం
- ఆల్ ఇండియా 5 మరియు 8వ ర్యాంకులతో ప్రభంజనం

**మొయినాబాద్ మున్సిపాలిటీ ఏప్రిల్ 16 (వార్త వేదిక సూర్య )**

శ్రీ స్వామినారాయణ గురుకుల్ ఇంటర్నేషనల్ స్కూల్, హైదరాబాద్ సీబీఎస్ఈ పదో తరగతి బోర్డు పరీక్షా ఫలితాల్లో శ్రీ స్వామినారాయణ గురుకుల్ ఇంటర్నేషనల్ స్కూల్ మరోసారి తన విద్యా ప్రమాణాలను చాటుకుంటూ అద్భుతమైన ఫలితాలను సాధించింది. గత 27 ఏళ్లుగా విద్యా, సామాజిక మరియు ఆధ్యాత్మిక రంగాల్లో విశేష సేవలందిస్తున్న ఈ సంస్థ, ఈ ఏడాది విజయాల పరంపరలో కొత్త మైలురాళ్లను అధిగమించింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను మరియు విద్య, సద్విద్య, బ్రహ్మవిద్య అనే ఉన్నత ఆశయాలను విద్యార్థులకు అందించడం ఈ సంస్థ ప్రత్యేకత. ప్రస్తుతం ఇక్కడ 27 రాష్ట్రాల నుండే కాకుండా విదేశాల నుండి వచ్చిన వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరిలో 350 మందికి పైగా విద్యార్థులకు సంస్థ ఉచిత విద్యను అందిస్తోంది.

**ఈ ఏడాది ఫలితాల ముఖ్యాంశాలు:**

దేశవ్యాప్తంగా సుమారు 25,08,319 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, వారిలో గురుకుల్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి ఆల్ ఇండియా టాప్ 25 జాబితాలో 41 స్థానాలను కైవసం చేసుకున్నారు.కుజల వరుణ్: 494/500 మార్కులతో ఆల్ ఇండియా 5వ ర్యాంకు ఏ ఐ ఆర్ 5) సాధించి ప్రథమ స్థానంలో నిలిచాడు. జంపాల శ్రీ రామ్: 491/500 మార్కులతో ఆల్ ఇండియా 8వ ర్యాంకు (AIR 8) సాధించి ద్వితీయ స్థానంలో నిలిచాడు. విశేష గుర్తింపు: 30 మంది విద్యార్థులు వివిధ సబ్జెక్టుల్లో 100 కి 100 మార్కులు పెర్ఫెక్ట్100) సాధించి రికార్డు సృష్టించారు. గణాంకాల్లో విజయం:మొత్తం ఫలితం: 100% ఉత్తీర్ణత 95% పైగా మార్కులు: 35 మంది విద్యార్థులు.90% పైగా మార్కులు: 179 మంది విద్యార్థులు.డిస్టింక్షన్: మెజారిటీ విద్యార్థులు డిస్టింక్షన్ సాధించి తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనే అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. ఈ చారిత్రాత్మక విజయంపై సంస్థ అధ్యక్షులు మహంత్ స్వామి సద్గురు శ్రీ దేవప్రసాద్‌దాస్ జీ స్వామి హర్షం వ్యక్తం చేస్తూ.. విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల అంకితభావం, సంతుల మార్గదర్శనం మరియు భగవంతుని ఆశీస్సుల వల్లే ఇది సాధ్యమైందని కొనియాడారు. విద్యార్థులకు మరియు వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ప్రిన్సిపాల్ మరియు విద్యా విభాగం సిబ్బంది మాట్లాడుతూ.గురుకుల్‌లో ప్రతి విద్యార్థి ఒక సక్సెస్ స్టోరీ అని గర్వంగా ప్రకటించారు.

సంచిక: 321 వార్త వేదిక సూర్య
హైదరాబాద్
శుక్రవారం, ఏప్రిల్ 17, 2026




# జనాభా ప్రాతిపదికన పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం

### : ది సిటిజన్స్ కౌన్సిల్ ఆందోళన

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 16 ( వార్త వేదిక సూర్య ) :
పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా చూడాలని కోరుతూ 'ది సిటిజన్స్ కౌన్సిల్ - సైబరాబాద్' ప్రతినిధులు భారత రాష్ట్రపతికి వినతి పత్రం సమర్పించారు. దేశ ఆర్థికాభివృద్ధిలోనూ, పన్నుల చెల్లింపులోనూ, జనాభా నియంత్రణలోనూ అగ్రగామిగా ఉన్న దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడాలని ఈ సందర్భంగా వారు కోరారు. రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 81, 82 ప్రకారం కేవలం జనాభా ప్రాతిపదికన లోక్‌సభ స్థానాల విభజన జరిగితే, జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలు రాజకీయంగా ప్రాధాన్యత కోల్పోయే ప్రమాదం ఉందని కౌన్సిల్ ఆందోళన వ్యక్తం చేసింది. దీనివల్ల ఉత్తర భారత రాష్ట్రాల సీట్లు పెరిగి, పార్లమెంట్‌లో శక్తి సమతుల్యత దెబ్బతింటుందని, ఇది ఫెడరల్ వ్యవస్థకు విఘాతమని పేర్కొన్నారు. ముఖ్యంగా తెలంగాణ వంటి రాష్ట్రాల్లో ప్రస్తుతం ఉన్న 17 సీట్ల ప్రాముఖ్యత భవిష్యత్తులో తగ్గే అవకాశం ఉందని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ ఉపాధ్యక్షుడు అందె లక్ష్మణ్ రావు, ప్రధాన కార్యదర్శి ఆరిఫ్ మొహమ్మద్, సభ్యులు ఖుర్షీద్, మల్లికార్జున, షఫీక్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు శాస్త్రిపురం రైల్వే ఓవర్ బ్రిడ్జి ప్రారంభోత్సవం

### - రూ. 71 కోట్లతో నిర్మాణం.. ప్రారంభించనున్న మంత్రి శ్రీధర్ బాబు

### - భారీగా తరలిరావాలని ఎన్. ధనుంజయ పిలుపు

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 16 ( వార్త వేదిక సూర్య ) :



రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని శాస్త్రిపురం - ఫలక్ నుమా రైల్వే లైన్ వద్ద నిర్మించిన గ్రేడ్ సెపరేటర్ ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైంది. సుమారు 71 కోట్ల రూపాయల భారీ వ్యయంతో నిర్మించిన ఈ బ్రిడ్జిని శుక్రవారం (ఏప్రిల్ 17న) ఉదయం 8:30 గంటలకు ఐటి మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా ఎమ్మెల్సీ మరియు ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి , రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాల్గొని బ్రిడ్జిని ప్రజలకు అంకితం చేయనున్నారు. ఈ వంతెన అందుబాటులోకి రావడం వల్ల శాస్త్రిపురం, మైలార్‌దేవ్‌పల్లి మరియు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తొలిగి, ప్రయాణం సులభతరం కానుంది అన్నారు. ఈ సందర్భంగా మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎన్. ధనుంజయ మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధిలో ఇదొక కీలక ఘట్టమని పేర్కొన్నారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు మరియు ప్రజలందరూ పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# బార్ కౌన్సిల్ సభ్యుడు గోకుల్ రామారావుకు ఘన సన్మానం

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 16 ( వార్త వేదిక సూర్య ) :



తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడిగా భారీ మెజారిటీతో ఎన్నికైన గోకుల్ రామారావును గురువారం రాజేంద్రనగర్ కోర్టు ఆవరణలో ఘనంగా సన్మానించారు. అడ్వకేట్ కొంగళ్ళ నవీన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు..ఈ సందర్భంగా గోకుల్ రామారావుతో పాటు తెలంగాణ బార్ అసోసియేషన్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ విష్ణువర్ధన్ జయ సూర్యను, రాజేంద్రనగర్ కోర్ట్స్ ప్రెసిడెంట్ మిద్దె సుదర్శన్‌ను కూడా శాలువాలు, పూలమాలలతో గౌరవించారు. ఈ సందర్భంగా కొంగళ్ళ నవీన్ మాట్లాడుతూ.. న్యాయవాదుల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడే గోకుల్ రామారావు లాంటి వ్యక్తులు బార్ కౌన్సిల్‌కు ఎన్నికవ్వడం హర్షణీయమని పేర్కొన్నారు. న్యాయవాదుల వృత్తిపరమైన సమస్యల పరిష్కారంలో నూతన కార్యవర్గం చురుకైన పాత్ర పోషించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్లు ప్రతాప్, వికాస్, యశ్వంత్, ముకేశ్ తదితరులు పాల్గొని ఎన్నికైన ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు.

# హక్కుల కోసం 'ఆర్టిసన్' గర్జన





### - ఇది ఆకలి కేక కాదు.. ఆత్మగౌరవ పోరాటం!

### - కార్మికులకు అండగా నిలిచిన పటోళ్ల కార్తీక్ రెడ్డి, ఎమ్మెల్సీ రహమత్ బేగ్

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 16 ( వార్త వేదిక సూర్య ) :
చీకటిని చీల్చి వెలుగులు పంచే చేతులు.. తమ బతుకుల్లో వెలుగు కోసం పోరాట బాట పట్టాయి! నిరంతరం విద్యుత్ తీగలతో ప్రాణాలకు తెగించి పోరాడే ఆర్టిసన్ ఉద్యోగులు, నేడు తమ హక్కుల కోసం రాజేంద్రనగర్ వీధుల్లో 'సమ్మె సైరన్' మోగించారు. తొమ్మిది రోజుల పట్టుదల.. మొక్కవోని ధైర్యం! ఒకటి కాదు, రెండు కాదు.. ఏకధాటిగా 9 రోజులుగా విధులను బహిష్కరించి, ఎండను సైతం లెక్కచేయకుండా కార్మికులు చేస్తున్న ఈ పోరాటం ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేస్తోంది. సమాన పనికి సమాన వేతనం అనేది కేవలం ఒక డిమాండ్ కాదు, అది వారి శ్రమకు దక్కాల్సిన గౌరవం. పది సంఘాలు ఒక్కటిగా, ఒకే తాటిపైకి వచ్చి తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్ జాయింట్ యాక్షన్ కమిటీ ( టీవిఎజేఎ సి) గా ఏర్పడటం వారి ఐక్యతకు నిదర్శనం. తమ ఉనికిని చాటుకుంటూ, భవిష్యత్తు తరాల బాగు కోసం వారు

ఆరు ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచారు. విద్యార్హతకు తగ్గ గుర్తింపు, సర్వీస్ రూల్స్ అమలు, అవుట్ సోర్సింగ్ శాపం నుండి విముక్తి, కనీస వేతనం మరియు పీఆర్సీ అమలు కోసం వారు చేస్తున్న ఈ యుద్ధం న్యాయ బద్ధమైనది. కార్మికుల ఆవేదనను చూసి రాజేంద్రనగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జ్ పటోళ్ల కార్తీక్ రెడ్డి, ఎమ్మెల్సీ రహమత్ బేగ్ కదిలి వచ్చారు. ధర్నా చౌక్ లో కూర్చున్న ప్రతి కార్మికుడిలో స్ఫూర్తిని నింపుతూ,

మీ పోరాటంలో మేమున్నాం అంటూ భరోసానిచ్చారు. పోరాడితేనే హక్కులు దక్కుతాయని నమ్మి, ఐక్యతనే ఆయుధంగా మలచుకున్న ఆర్టిసన్ల ఈ 'సమ్మె సైరన్' ప్రభుత్వానికి ఒక హెచ్చరిక. తమ చెమట చుక్కకు విలువ కట్టే వరకు, తమ శ్రమకు గౌరవం దక్కే వరకు ఈ పోరాటం కొనసాగుతుంది అని వారు అన్నారు

# 9వ రోజుకు చేరిన విద్యుత్ కార్మికుల సమ్మె

### ప్రభుత్వ అణచివేత చర్యలు ప్రజాస్వామ్య విరుద్ధం: మణికొండ బిఆర్ఎస్ నేతలు

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 16 ( వార్త వేదిక సూర్య ) :
తెలంగాణ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఆర్టిసన్లు, అవుట్‌సోర్సింగ్ మరియు పీస్ రేట్ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం చేపట్టిన నిరవధిక సమ్మె గురువారంతో 9వ రోజుకు చేరుకుంది. విద్యుత్ ప్రసార వ్యవస్థను నిలకడగా కొనసాగిం చడంలో కీలక పాత్ర పోషిస్తున్న 19,000 మంది కార్మికుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న మొండి వైఖరిపై మణికొండ బిఆర్ఎస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఏటా రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, విధుల్లో ఉన్న కార్మికులను రెగ్యులరైజ్ చేయకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. చర్చల ద్వారా సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు, అందుకు విరుద్ధంగా ఎస్మా అమలు చేయడం, ప్రమాద బీమా నిలిపివేయడం మరియు ఉద్యోగాల నుండి తొలగిస్తామని బెదిరింపులకు దిగడం మానవత్వానికే గొడ్డలి పెట్టు అని వారు మండిపడ్డారు.



కార్మికుల పట్ల సానుభూతితో వ్యవహరించాలని, సమస్యను పరిష్కరిస్తేనే ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసం పెరుగుతుందని వారు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి స్థానిక నాయకులు సీతారం ధూళిపాళ, కుంభగల్ల ధనరాజ్, గుట్టమీది నరేందర్, అందె లక్ష్మణ్ రావు, యాలల కిరణ్, భానుచందర్, సుమనళిని తదితరులు పాల్గొన్నారు.

# బానేష్ నగర్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం



### రూ. 10 లక్షలతో అభివృద్ధి పనుల ప్రారంభం

### టీపీసీసీ ఓబీసీ విభాగం నేత పర్వతాల రాజేందర్

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 16 ( వార్త వేదిక సూర్య ) :
జంగమ్మెట్ డివిజన్ పరిధిలోని లాల్ దర్వాజా, బానేష్ నగర్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. జీహెచ్ఎంసీ ప్రత్యేక బడ్జెట్ ( ఎస్ ఎ ఎం సి )కింద మంజూరైన రూ. 10 లక్షల నిధులతో చేపట్టనున్న నూతన కాచమోరి పైప్‌లైన్ మరియు సి.సి. రోడ్డు పనులను టీపీసీసీ ఓబీసీ విభాగం నేత పర్వతాల రాజేందర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..



కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు తమ వంతు కృషి చేస్తు న్నామని తెలిపారు. ప్రజల విన్నపం మేరకు ప్రత్యేక నిధులను కేటాయించి, ఈ ప్రాంతంలో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా పైప్‌లైన్ పనులను చేపడుతున్నట్లు వివరించారు. నాణ్యతతో కూడిన పనులను గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన పేర్కొన్నారు. పనుల్లో నాణ్యత పాటించాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు.

తమ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్న రాజేందర్‌ను స్థానిక అసోసియేషన్ ప్రతినిధులు శాలువా మరియు పూలమాలలతో ఘనంగాసత్కరించారు. ఈ కార్యక్రమంలో గోపాల్ స్వామి, నితేష్ సింగ్, అశోక్, రాహుల్, పి. సదమణి శంకర్ తదితర ముఖ్య నేతలు మరియు స్థానిక కాలనీ వాసులు పాల్గొన్నారు.

# శ్రమ దోపిడీ ఆపండి.. సమాన వేతనం ఇవ్వండి!





### - ఆర్టిజన్ల పోరాటానికి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి పూర్తి మద్దతు

### - విద్యుత్ కార్మికుల న్యాయ పోరాటానికి బీఆర్ఎస్ భరోసా

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 16 ( వార్త వేదిక సూర్య ) :
రాష్ట్రానికి వెలుగులు పంచే విద్యుత్ ఆర్టిజన్ల జీవితాలను ప్రభుత్వం అంధకారంలోకి నెడుతోందని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి విమర్శించారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ శాఖ ఆర్టిజన్ ఉద్యోగులు గురువారం రాజేంద్రనగర్ మరియు శివరాంపల్లి విద్యుత్ సబ్-స్టేషన్ల వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఆయన హాజరై పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ.. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనే ఆర్టిజన్ల డిమాండ్ ముమ్మాటికీ న్యాయమైనదని పేర్కొన్నారు. ప్రాణాలకు తెగించి విద్యుత్ సరఫరా కోసం అహర్నిశలు శ్రమిస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. ఏళ్ల తరబడి సేవలు అందిస్తున్న వీరి ఆరు ప్రధాన డిమాండ్లను తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికుల పోరాటంలో బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎస్. వెంకటేష్, అర్చన జైప్రకాష్, ముక్రం ఖాన్, జహీర్ ఖాన్, హైమద్ పటేల్, అక్కెం రాఘవేందర్ యాదవ్, కొంపల్లి జగదీష్, ఎడ్లకడి సూర్యం, జె. సునీల్, రామకృష్ణ, అశోక్ కుమార్, అరుణ్ ముదిరాజ్, కృష్ణ ముదిరాజ్, రిషి, హర్షత్, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో విద్యుత్ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు



# అధికారుల నిర్లక్ష్యం

### 20 అడుగుల పైనుండి పడి పారిశుద్ధ్య కార్మికుడికి తీవ్ర గాయాలు

### - ఫ్లెక్సీలు తీయమంటూ ఒత్తిడి తెచ్చిన వైనం.. కరెంటు షాక్‌తో విరిగిన కాలు

### - ఎస్.ఆర్.పి బాలరాజును సస్పెండ్ చేయాలని ఏఐటీయూసీ డిమాండ్

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 16 ( వార్త వేదిక సూర్య )




మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి ఓ పారిశుద్ధ్య కార్మికుడు బలైపోయాడు. నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి రక్షణ పరికరాలు లేకుండా ప్రమాదకర రీతిలో ఫ్లెక్సీలు తొలగించాలంటూ అధికారులు చేసిన ఆదేశం ఒక నిరుపేద కుటుంబంలో విషాదాన్ని నింపింది. శేర్లింగంపల్లి మున్సిపల్ సర్కిల్ పరిధిలో జరిగిన ఈ ఘటనలో తీవ్రంగా గాయపడి సనత్ నగర్ ఈఎస్ఐ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుడు ఎం. రాజశేఖర్‌ను సోమవారం తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర నేతలు పరామర్శించారు. లింగంపల్లి పాపిరెడ్డి కాలనీకి చెందిన రాజశేఖర్ (32) గత 11 ఏళు గా పారిశుద్ధ్య కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున 5 గంటలకు విధులకు హాజరైన రాజశేఖర్‌ను, పాపిరెడ్డి కాలనీ కమాన్‌కు ఉన్న ఫ్లెక్సీలను తొలగించాలని ఎస్.ఆర్.పి (రాస్రా) బాల్ రాజు ఆదేశించారు. వాస్తవానికి ఫ్లెక్సీల తొలగింపు ఎన్ఫోర్స్మెంట్ విభాగం పని అయినప్పటికీ, పారిశుద్ధ్య కార్మికుడిపై ఒత్తిడి తెచ్చారు. అధికారుల ఆదేశంతో సుమారు 20 అడుగుల ఎత్తు ఉన్న కమాన్‌పైకి ఎక్కి ఫ్లెక్సీలు తొలగి స్తుండగా, పక్కనే ఉన్న విద్యుత్ తీగలు తగిలి రాజశేఖర్ కరెంటు షాక్‌కు గురయ్యాడు. దీంతో ఒక్కసారిగా పైనుండి కింద పడిపోవడంతో అతని కుడికాలు విరిగి, శరీరానికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ కే. యేసురత్నం, రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ అధికారుల తీరుపై మండిపడ్డారు. అమాయక కార్మికుడి ప్రాణాలతో అధికారులు చెలగాటం ఆడుతున్నారు. ఎన్ఫోర్స్మెంట్ వాహనం చేయాల్సిన పనిని, రక్షణ కవచాలు లేని పారిశుద్ధ్య కార్మికుడికి అప్పగించడం నేరం అని వారు పేర్కొన్నారు. రాజశేఖర్‌కు భార్య, మూడేళ్ల కుమార్తె ఉన్నారు. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న వ్యక్తి ప్రమాదానికి గురికావడంతో ఆ కుటుంబం రోడ్డున పడిందని, తక్షణమే ప్రభుత్వం స్పందించాలని కార్మిక సంఘం నేతలు కోరారు.

# ఎస్ ఆర్ హాస్పిటల్ ప్రాంతంలో పర్యటించిన మాజీ కార్పొరేటర్ డా.హేమ సామల

సికింద్రాబాద్ ఎప్రిల్ 16(వార్త వేదిక సూర్య)



మధురనగర్, ఎస్ఆర్ హాస్పిటల్ ప్రాంతంలో మాజీ కార్పొరేటర్ డా. హేమ సామల పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు తమ ప్రాంతంలో త్రాగునీటి సరఫరాలో తగిన ప్రెజర్ లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యలను విన్న డా. హేమ గారు సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. త్రాగునీటి సమస్య ప్రజలకు అత్యవసరమైందని, దీనిపై నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే పరిష్కారం అందించాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. అనంతరం స్థానికులతో మాట్లాడుతూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు ఏదైనా సమస్య ఉంటే మా దృష్టికి తీసుకురావాలని కోరారు ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు

# విద్యుత్ ఆర్టిజన్ల పోరాటానికి బీజేపీ మద్దతు





## శివరాంపల్లిలో కొనసాగుతున్న నిరసన; పాల్గొన్న బీజేపీ నేత తోకల శ్రీనివాస్ రెడ్డి

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 16 ( వార్త వేదిక సూర్య ) :
తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ( టీ వి ఎ ఈ జె ఎ సి) ఆధ్వర్యంలో శివరాంపల్లిలోని ఏక్తా కాలనీలో చేపట్టిన నిరసన దీక్షలు గురువారానికి 9వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా నిరసన తెలుపుతున్న కార్మికులకు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి సంఘీభావం ప్రకటించి, వారితో కలిసి ధర్నాలో హాజరు అయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రాణాలకు తెగించి, రేయింబవళ్లు ప్రజలకు విద్యుత్ సేవలు అందిస్తున్న ఆర్టిజన్ కార్మికులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా మోసం చేశాయని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఈ కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చి గద్దెనెక్కిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇప్పుడు వారిని గుర్తించకపోవడం శోచనీయ మన్నారు. ఆర్టిజన్ కార్మికులు భారీ జీతాలు కోరడం లేదు. ఇతర విద్యుత్ ఉద్యోగుల మాదిరిగానే తమకు రిటైర్మెంట్ బెనిఫిట్స్, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని మాత్రమే అడుగుతున్నారు. కనీస మానవత్వం లేకుండా ప్రభుత్వం అహంకారపూరిత మాటలతో కాలయాపన చేస్తోంది అని ఆయన మండిపడ్డారు. వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం తన హామీని నిలబెట్టుకోవాలని, ఆర్టిజన్లను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులకు న్యాయం జరిగే వరకు భారతీయ జనతా పార్టీ అండగా ఉంటుందని, అవసరమైతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



## మహిళ మణుల ర్యాలిలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ - కొంతం దీపిక

సికింద్రాబాద్, ఎప్రిల్ 16(వార్త వేదిక సూర్య)
ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంట్లో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెడుతున్న సందర్భంగా గురువారం సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్వర్యంలో సత్య మాల్, ప్రాగటూర్స్ కల్పన థియేటర్, నుండి ప్రారంభమై పద్మశాలి కాలనీ మీదిగా గాంధీ విగ్రహం, కెనర బ్యాంక్, గాంధీ నగర్ వరకు భారీగా మహిళా మణుల ర్యాలి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మోండా మార్కెట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొంతం దీపిక పాల్గొన్నారు.

## గుడిపల్లి మండలం గణపురం గ్రామం - బీఆర్ఎస్ పార్టీ నూతన గ్రామ శాఖ కమిటీ ఎన్నిక

దేవరకొండ ఏప్రిల్ 16 ( వార్త వేదిక సూర్య ):-



బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ఎల్గూరి వల్లపురెడ్డి ఆదేశాల మేరకు, కటికనేని మాధవరావు ఆధ్వర్యంలో తోటకూరి పరమేష్ యాదవ్ అధ్యక్షతన, కస్తూరి యాదగిరి సలహాలతో గన్నబోయిన వెంకటయ్య యాదవ్ సమక్షంలో గణపురం గ్రామ బీఆర్ఎస్ పార్టీ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది.

నూతన గ్రామ శాఖ కమిటీ

- అధ్యక్షులు తోటకూరి కోటేష్ యాదవ్ ఉపాధ్యక్షులు శివ చారి -కార్యదర్శి మైనం లింగయ్య యువజన శాఖ- అధ్యక్షులు.బొడ్డుపల్లి సాయికుమార్ఉపాధ్యక్షులు రేకులరపు నరేష్

-కార్యదర్శి మైనం కోటేష్ ఎస్సీ సెల్ అధ్యక్షులు. మైనం శీను కార్యదర్శి అరకేశ్వరపు నగేష్

బీసీ సెల్

-అధ్యక్షులు.బెజవాడ బాలకృష్ణ కార్యదర్శి. బొడ్డుపల్లి సైదులు

సోషల్ మీడియా అధ్యక్షులు. ఎర్ర మధు ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు

## ప్రజాస్వామ్యం దినపత్రిక ఎడిటర్ రమేష్ బాబుకు సన్మానం

### నాల్గవ కన్ను ప్రజాస్వామ్యం దినపత్రిక

నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 16 (వార్తా వేదిక సూర్య )



నల్గొండ జిల్లా కేంద్రంలో గురువారం ప్రజాస్వామ్యం దినపత్రిక చీఫ్ ఎడిటర్ వెన్నమల్ల రమేష్ బాబు కు నివాసంలో బాలరాజు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడారు. ప్రజాస్వామ్యం దినపత్రిక ప్రజల సమస్యలపై నిరంతరం ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తూ, ప్రజల పక్షం ఉంటుందని, ప్రభుత్వాలను ప్రశ్నించే ప్రజాస్వామ్యం దినపత్రిక పనిచేస్తుందని, సూచించారు. మోసాలను ప్రజల ముందు బహిర్గతం చేసే నాల్గవ కన్ను ప్రజాస్వామ్యం దినపత్రిక అని తెలిపారు.

# ప్రతి చెరువు నిండాలి - ప్రతి గుంటకు సాగునీరు అందాలి





## దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

దేవరకొండ ఏప్రిల్ 16 ( వార్త వేదిక సూర్య):-
పీఏ పల్లి మండల పరిధిలోని ఏకేబిఆర్ లిఫ్ట్ ఇరిగేషన్ పనుల పరిశీలన మరియు ఇందులో భాగంగా నిర్మించునున్న మెయిన్ డెలివరీ సిస్టర్న్ నిర్మాణ పనులను ఇరిగేషన్ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రారంభించిన దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ ఎ.కె.బి.ఆర్ లిఫ్ట్ స్కీము ద్వారా దేవరకొండ నియోజకవర్గము లోని పెద్దఅడిశర్ల పల్లి మండలం లో గల పెద్దఅడిశర్ల పల్లి, సూరేపల్లి, చిలకమర్రి, రోళ్ళకల్ గ్రామాల క్రింద ఉన్న 4609 ఎకరాల ఆయకట్టుకు మరియు నాగార్జునసాగర్ నియోజకవర్గము లోని గుర్రంపోడు మండలం లో గల పాల్వాయి, షాఖాజిపూర్, పార్లపల్లి, కాల్వపల్లి,పాశవానిగూడెం మరియు మక్కపల్లి గ్రామాల క్రింద ఉన్న 2082 ఎకరాల ఆయకట్టుకు నీరు అందించుటకు రూ.90.96 కోట్ల విలువతో మొత్తం ఆయకట్టు 6691 ఎకరాల ఆయకట్టుకు లిఫ్ట్ పనులు మంజూరు అయింది అన్నారు.ఈ ఎత్తిపోతల పథకం ద్వారా అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుండి 54మీటర్ల హెడ్ కు 5ఇ355 కిలోవాట్ల సామర్థ్యం గల పంపులతో 80 క్యూసెక్కు నీరు ఎత్తిపోయబడుతాయి అని అన్నారు. పంపు హౌస్ కాంక్రీట్ పనులు పూర్తి చేయడం జరిగింది అన్నారు ప్రేజర్ మెయిన్ పైపు లైను మొత్తం కి.మీ 5.100 కు గాను కి.మీ 4.000 కు పైపు లైను పనులు పూర్తి అయినవి. ఎ.కె.బి.ఆర్ లిఫ్ట్ స్కీము పనులు 36% ఇప్పటికే పూర్తి అయినది. ప్రాజెక్టు పనుల్లో నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని అధికారులను, కాంట్రాక్ట్ లను ఆదేశించారు. నిర్ణీత కాలవ్యవధిలోగా ఈ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు దేవరకొండ నియోజక వర్గ ప్రాంత ప్రజలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు ఏ కే బి ఆర్ లిఫ్ట్ ఇరిగేషన్ పెండింగ్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి,రైతుల ముఖాల్లో ఆనందం చూడడమే ఆయన సాధించుకున్న గొప్ప పని అన్నారు. చిత్రియాల, గాజుపేట, రాములోనిబండ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల గురించి సిఇ శ్రీనివాస్ రెడి కి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీరింగ్ శ్రీనివాస్ రెడ్డి ,యస్ఇ భద్రు నాయక్,ఈ ఈ సత్యనారాయణ,డి ఇ నాగయ్య, ప్రజా ప్రతినిధులు, రైతులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు పైన మరోసారి పార్లమెంట్ సాక్షిగా విషం కక్కిన బీజేపీ

### తెలంగాణ ఏర్పాటును భారత దేశం మరియు పాకిస్థాన్ తో పోల్చిన ఎంపీ తక్షణమే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలి...

### -బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్

దేవరకొండ ఏప్రిల్ 16 ( వార్త వేదికసూర్య):-



తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు పైన మరోసారి పార్లమెంట్ సాక్షిగా విషం కక్కిన బీజేపీ, తెలంగాణ ఏర్పాటును భారత దేశం మరియు పాకిస్థాన్ తో పోల్చిన ఎంపీ తక్షణమే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలి అని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ డిమాండ్ చేశారు.గురువారం దేవరకొండ పట్టణంలో ఆయన మాట్లాడుతూ......నేడు పార్లమెంట్ లో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారతదేశం మరియు పాకిస్థాన్ ఏర్పాటు తో పోల్చడం నీచం, బీజేపీ కి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం గా ఏర్పడటం ఇష్టం లేదని అర్థం అవుతుంది అని ఆయన అన్నారు.రాజ్యాంగ పద్ధతిలో ఏర్పడిన రాష్ట్ర పాకిస్థాన్ ఏర్పాటు తో పోల్చడం ఇంత దారుణం మరొకటి ఉండదు, ఇన్ని సంవత్సరాలు తెలంగాణ పైన కపట ప్రేమ ఎందుకు చూపెడుతుంది అనేది పార్లమెంట్ సాక్షిగా బీజేపీ ఎంపీ మాటలతో తేట తెల్లం అయ్యింది అని ఆయన అన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గారి ప్రభుత్వంలో రాష్ట్ర ఎంత అభివృద్ధి చెందినదో, దాంట్లో కేంద్రం ఎటువంటి సాయం చేయకపోనికి రావాల్సిన నిధులు విడుదల చేయకపోడానికి కారణం అర్థం అవుతుంది, కాళేశ్వరం ప్రాజెక్టు కు జాతీయ హోదా కల్పించకపోవడం కూడా అందుకేనా అనిపిస్తుంది అని ఆయన అన్నారు.మన రాష్ట్రం నుండి 8 మంది ఎంపీ లు ఉండి కూడా ఒక ప్రాజెక్ట్ తేకపోవడం వెంక బీజేపీ సవితి తల్లి ప్రేమ కనిపిస్తుంది ఆయన అన్నారు.రాష్ట్రం నుండి ఒక కేంద్ర మంత్రి, మరియు కేంద్ర సహాయ మంత్రి ఉండి కూడా తెలంగాణ విభజనను పైక్శాన్ విభజన తో పోల్చడం సిగ్గు చేటు అని ఆయన అన్నారు.స్వర్గీయ సుష్మ స్వరాజ్ గారిని తెలంగాణ చిన్నమ్మ గా పిలుస్తారు, ఈ రోజు తేజస్వి సూర్య చేసిన వాక్యాలు తెలంగాణ కోసం ఉద్యమం చేసిన సుష్మాస్వరాజ్ గారిని అవమానించినట్టే అని తెలిపారు.బజప్త బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య క్షమాపణ చెప్పాలి, మన రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న 8 మంది ఎంపీ లు క్షమాపణ చెప్పియాలి లేదా తక్షణమే తెలంగాణ ఏర్పాటును అవమానించినందుకు బాధ్యతగా రాజీనామా చేయాలి అని డిమాండ్ చేశారు.తెలంగాణ ప్రజలు అన్ని గమనిస్తున్నారు , స్వరాష్ట్ర సాధన కోసం ఉ ద్యమం చేసిన బిఆర్ఎస్ పార్టీ మనకు శ్రీరామ రక్ష, ఈ సారి రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో ఉన్న బీజేపీ పార్టీ కి తగిన బుద్ధి చెప్తారు, తెలంగాణ గడ్డ ఉద్యమాల అడ్డ ఎవడు పడితే వాడు ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే తెలంగాణ గురించి చిరుతం అని ఆయన హెచ్చరించారు



## ఆదర్శంగా గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దుతా : సర్పంచ్ యుగంధర్ రెడ్డి

దేవరకొండ ఏప్రిల్ 16 8 ( వార్త వేదిక సూర్య ):-



కొండ మల్లేపల్లి మండలం మేజర్ గ్రామపంచాయతీ డ్రైనేజీ పనులను 8.9.10. వార్డులలో గత కొన్ని రోజులుగా ముమ్మరంగా సాగుతున్నాయి వేసవి కాలంలో డ్రైనేజీ పనులను చేస్తున్న కూలీలకు ఎండ త్రివత దుష్టల పెట్టుకుని సౌకర్యమైన వస్తువులను కూలీలకు కూలింగ్ క్యాప్స్ బ్లౌజులు మధ్యాహ్నం చల్లని మజ్జిగ అందచేసిన కొండ మల్లేపల్లి సర్పంచ్ యుగంధర్ రెడ్డి పనులను క్షణం క్షణం పశీలిస్తూ వార్డు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా నేనున్నానని మనోధైర్యాన్ని కల్పిస్తున్న సర్పంచ్ యుగంధర్ రెడ్డి ఏ సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలని కోరడం జరుగుతుంది గతంలో చేసిన ఈ రాజకీయ నాయకులు 8.9.10 వార్డులలో మా సమస్యలను ఎవరు గుర్తు చేసుకుని పట్టించుకున్న నాధుడు లేడు ఈరోజు మీరు శ్రీమంతుడు లాగా వచ్చి మా వార్డు పనులను దగ్గరుండి పని చేయించడం సంతోషంగా ఉందని కాలినీ వాసులు సంతోషం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పద్మ వెంకటయ్య వార్డు నెంబర్స్ గంట మల్లేష్ యాదవ్ బిజిలీ లింగం కొండమల్లేపల్లి డ్రైనేజీ కాంట్రాక్టర్ ఎమ్మార్పీఎస్ మండల పార్టీ అధ్యక్షులు కూలీలు తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందించడమే లక్ష్యం

### మండల ప్రత్యేక అధికారి రాజశేఖర్

గట్టుప్పల.ఏప్రిల్ 16.వార్త వేదిక సూర్య:



ప్రజా సంక్షేమమే పరమావధిగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని గట్టుప్పల ప్రత్యేక అధికారి రాజశేఖర్ తెలిపారు. గురువారం 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రం లోని రైతు వేదిక కార్యాలయ ఆవరణంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై శాఖల వారీగా మండల అధికారులు ప్రజలకు వివరించారు. ముఖ్యంగా రైతు రుణమాఫీ, రైతుబంధు, పెన్షన్ల పంపిణీ, సన్న బియ్యం, 200 యూనిట్ల ఉచిత కరెంటు, సబ్సిడీపై గ్యాస్ సిలిండర్ల పంపిణీ, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు, ఇలా ప్రభుత్వం కల్పించే సంక్షేమ పథకాల గురించి క్షుణ్ణంగా వారు వెల్లడించారు. ఆయా గ్రామ సర్పంచులు మాట్లాడుతూ గ్రామాలలో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాల్లో అభివృద్ధి చేయడానికి నిధులు రావడం లేదన్నారు. ఎంపీడీవో వసంత లక్ష్మి అధ్యక్షతన వహించిన కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో తహశీల్దార్హోముల, ఎస్. ఐ సంజీవరెడ్డి,ఎంపిఓ సునీత, పంచాయతీ కార్యదర్శులు వివిధ శాఖల అధికారులు, గ్రామ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 19 న ఎం వి ఎన్ విజ్ఞాన కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం

### ఇంటర్ పదవ తరగతి పరీక్షలు పూర్తి చేసుకున్న విద్యార్థులకు వేసవి కంప్యూటర్, కరాటే శిక్షణ శిబిరం ప్రారంభం

నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 16 (వార్తా వేదిక సూర్య )
నర్రా రాఘవరెడ్డి స్మారక ప్రజా వైద్యశాల మరియు ఎంవిఎన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో షుగర్, బీపీ, ఫిట్స్, పక్షవాతం రోగులకు 2026 ఏప్రిల్ 19 మూడో ఆదివారం ఉదయం 7 గంటల నుండి 11 గంటల వరకు మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంవిఎన్ ట్రస్ట్ కార్యనిర్వాహక కార్యదర్శి పీ నర్సిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ జబ్బులు ఉన్నవారు 2,3 రోజులకు ముందే టెస్టులు చేసుకుని, ప్రస్తుతం వాడే మందులు డాక్టర్ రాసిన స్లిప్పులు మరియు పరీక్ష రిపోర్టులు తీసుకొని రావాలని కోరారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ గోపాలం శివన్నారాయణ పాల్గొంటారు. ఇంటర్, పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థిని విద్యార్థులకు మా సంస్థ ఆధ్వర్యంలో కంప్యూటర్, కరాటే శిక్షణ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కంప్యూటర్ నేర్చుకోవాలన్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. స్థలం: ఎంవిఎన్ విజ్ఞాన కేంద్రం, సిపిఎం కార్యాలయం వద్ద,

బస్టాండ్ రోడ్, నల్లగొండ.ఇంకా ఇతర వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను 9490098311, 9959342190, 9912249494 సంప్రదించాలని కోరారు.




## నోయిడా కార్మికుల పోరాటాలకు మద్దతు

### కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరసన : సీఐటీయూ

నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 16 (వార్తా వేదిక సూర్య )

నోయిడా, గ్రేటర్ నోయిడా, గురుగ్రామ్ మరియు మొత్తం జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్సీఆర్)లో కార్మికులు చేస్తున్న పోరాటాలపై ఉత్తరప్రదేశ్ మరియు హర్యానాలోని బిజెపి ప్రభుత్వాలు క్రూరంగా అణిచివేయడాన్ని సిఐటియు తీవ్రంగా ఖండిస్తోందని ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎండి సలీం అన్నారు.

గురువారం సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నోయిడా కార్మికుల పోరాటానికి మద్దతుగా కేంద్ర ప్రభుత్వ, గుజరాత్, హర్యానా రాష్ట్రాల బిజెపి ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా నల్లగొండ పట్టణం ఇక్బాల్ మీనార్ వలస కార్మికుల అడ్డా దగ్గర సిఐటియు పట్టణ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ.. నోయిడాలో ప్రాంతంలో పనిచేస్తున్న కార్మికులు రోజుకు 10 నుండి 13 గంటలు పనిచేస్తే కేవలం రూ. 10,000/-ల నుండి రూ. 12,000/-లు మాత్రమే చెల్లిస్తున్నారని, డబుల్ ఓటి ఇవ్వడం లేదని, ఈఎస్ఐ, పిఎఫ్, బోనస్ మరియు ఉద్యోగ భద్రత వంటి సౌకర్యాలు పరిశ్రమల యాజమాన్యాలు కల్పించకపోవడంతో కార్మికులు రూ. 26,000/-ల కనీస వేతనం, 8 గంటల పని విధానం, ఓటి, కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరణ చేయాలని నోయిడాలోని 50 వేల మంది కార్మికులు న్యాయంగా పోరాటం చేస్తున్నారని అన్నారు. కానీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి, వారి హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వాలు కార్మికుల పోరాటాన్ని అణిచివేస్తూ 400 మందికి పైగా కార్మికులను అరెస్ట్ చేశారని ఆరోపించారు. అనేకమంది సిఐటియు నాయకులను అక్రమంగా నిర్బంధించారని, మహిళా కార్మికులపై భౌతిక దాడులు జరిపారని అన్నారు. ప్రభుత్వం కార్పొరేట్ ప్రయోజనాలను కాపాడటానికి పోలీసు, ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉపయోగించి కార్మికుల పోరాటాన్ని దుర్మార్గంగా అణిచివేస్తుందని విమర్శించారు. పెరుగుతున్న దాడులు, అణచివేతకు నిరసనగా సమ్మెలో ఉన్న కార్మికులకు అండగా సిఐటియు దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. ఏప్రిల్ ఒకటి నుండి కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దుచేసి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ ల ప్రభావమే ఈ నిర్బంధమని అన్నారు. వెంటనే నాలుగు లేబర్ కోడ్ లను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దండంపల్లి సత్తయ్య, జిల్లా సహాయ కార్యదర్శి అవుట రవీందర్, కాంట్రాక్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి బాణాల పరిపూర్ణాచారి, అల్తాఫ్, మితిలేష్, లతీఫ్,దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ కు వినతి

నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 16 (వార్తా వేదిక సూర్య )



తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంగం (ఏ. వై. యు. ఎస్), రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్. పి ఐ), మరియు తెలంగాణ షెడ్యూల్డ్ కాస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (టి. ఎస్. సి. డబ్ల్యూ. ఏ) తరఫున ఒక ప్రతినిధి బృందం స్పీకర్ గడ్డం ప్రసాద్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జనరల్ సెక్రటరీ మీసా ల సైదులు మాట్లాడుతూ..భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భారత రాజ్యాంగ నిర్మాత మరియు సామాజిక న్యాయం ప్రతీక వారి కాంస్య విగ్రహాన్ని తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో ఏర్పాటు చేయవలని అన్నారు.అలాగే, ప్రస్తుతం ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి సమానమైన ఎత్తులోనే ఈ విగ్రహాన్ని నిర్మించాలని కూడా మేము కోరారు, ఇది సమాన గౌరవానికి సూచికగా నిలుస్తుందని అన్నారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ని ఈ విధంగా గౌరవించడం ద్వారా ప్రభుత్వం సమానత్వం, న్యాయం మరియు రాజ్యాంగ విలువల పట్ల తన నిబద్ధతను ప్రతిబింబిస్తుంది అని మేము గట్టిగా విశ్వసిస్తున్నాము అన్నారు. ఆయనలాంటి మహనీయునికి తగిన గౌరవం ఇవ్వకపోతే, అది దేశానికి మరియు సమాజానికి ఆయన చేసిన అపార సేవలను తగ్గించి చూపినట్లుగా భావించబడే అవకాశం ఉంది.కాబట్టి, ఈ అంశాన్ని స్పీకర్ దయచేసి పరిగణలోకి తీసుకొని, తక్షణ చర్యలు తీసుకొని న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

ఆ ప్రతినిధి బృందంలో ఎ . వై.యు.ఎస్ అధ్యక్షులు వినయ్ కుమార్, ఇతర నగర అధ్యక్షులు, కార్యదర్శులు, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నాయకులు టి. పద్మారావు, అలాగే టి . ఎస్.సి.డబ్ల్యూ. ఏ ప్రతినిధులు గా జనరల్ సెక్రటరీ మీసాల సైదులు ట్రెజరర్ విజయ్ కృష్ణ మరియు ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# గురుకుల సీట్లు సాధించిన విద్యార్థులను అభినందించిన మాజీ ఎంపీపీ దూదిపాల రేఖ శ్రీధర్ రెడ్డి





### ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించిన మాజీ ఎంపీపీ దూదిపాల రేఖ శ్రీధర్ రెడ్డి

- కొండమల్లేపల్లి పాఠశాల నుండి 30 మంది, చిన్న అడిశర్లపల్లి నుండి 7 గురుకి 7 విద్యార్థులకు సీట్లు

- ఉపాధ్యాయుల కృషిని కొనియాడుతూ సన్మానం- ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని వెల్లడి- కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో విద్యారంగానికి పెద్దపీట

దేవరకొండ ఏప్రిల్ 16 ( వార్త వేదిక సూర్య):-

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా రాణిస్తున్నారని, ఉపాధ్యాయుల అంకితభావమే ఈ విజయాలకు పునాది అని మాజీ ఎంపీపీ దూదిపాల రేఖ శ్రీధర్ రెడ్డి అన్నారు. ఇటీవల గురుకుల 5వ తరగతి ప్రవేశ పరీక్షలో కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని మండల ప్రాదేశిక ప్రాథమిక పాఠశాల నుండి ఏకంగా 30 మంది విద్యార్థులు సీట్లు సాధించిన సందర్భంగా గురువారం వారు విద్యార్థులను ఇంతటి ప్రతిభావంతులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. కొండమల్లేపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. ఉదయ, రామ్మూర్తి, ఉపాధ్యాయులు అంజయ్య, , అంజాచారి, సైదారాణి, జ్యోతి, సుకన్య, బిల్కీస్, జయమ్మ, సంధ్య భారతి, వరలక్ష్మి, కర్ణశ్రీ, శ్రీలతలను వారు శాలువాలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం నిరంతరం శ్రమిస్తున్న ఉపాధ్యాయుల సేవలు అమూల్యమైనవని కొనియాడారు. అదేవిధంగామండల పరిధిలోని చిన్న అడిశర్లపల్లి పాఠశాల నుండి 7 గురు విద్యార్థులు పరీక్ష రాయగా, 7 కి 7 గురు సీట్లు సాధించి వంద శాతం ఫలితాలు నమోదు చేయడం విశేషం. ఈ అద్భుత ప్రతిభకు కారణమైన చిన్న అడిశర్లపల్లి హెచ్ఎంరవికుమార్, టీచర్ తులసిలను వారు ప్రత్యేకంగా సన్మానించి అభినందించారు. అదేవిధంగా ధోనియాల పాఠశాల ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు సన్మానించారు. అనంతరం రేఖ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో గురుకుల పాఠశాలలు మెరుగైన వసతులు, నాణ్యమైన విద్యా విధానంతో ముందుకు సాగుతున్నాయని తెలిపారు. పిల్లల భవిష్యత్తు ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రుల చేతుల్లోనే ఉంటుందని, వారిని సమాజంలో ఉన్నతమైన వ్యక్తులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న విద్యా విధానాన్ని ప్రజలు వినియోగించుకోవాలని, తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని ఆమె కోరారు.

ఈ కార్యక్రమంలో కొండమల్లేపల్లి సర్పంచ్ యుగంధర్ రెడ్డి, దొనియాల సర్పంచ్ రామకృష్ణ, మాజీ వైస్ ఎంపీపీ కాసర్ల వెంకటేశ్వర్లు, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు యేకుల అనిత సురేష్, అశ్విన్ రెడ్డి, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మంగ్య నాయక్, నాయకులు ఉప్పలపల్లి జితేందర్, రవి, అంజి తదితరులు పాల్గొన్నారు వీరందరూ విద్యార్థుల ప్రతిభను కొనియాడుతూ, విద్యా రంగంలో ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక నాయకులు మరియు విద్యా ప్రేమికులు పాల్గొని సీట్లు సాధించిన విద్యార్థులకు మరియు సన్మానం పొందిన ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలియజేశారు

# హిమాచల్ ప్రదేశ్ లో ఎస్.ఎఫ్. ఐ కార్యకర్త సియా గులేరియా హత్యను ఖండించండి

### నిందితులను కఠినంగా శిక్షించాలి. ఎస్ ఎఫ్ ఐ కేంద్ర కమిటీ సభ్యులు ఖమ్మం పాటి శంకర్

నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 16 (వార్తా వేదిక సూర్య )




భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఎస్.ఎఫ్ ఐ కేంద్ర కమిటీ సభ్యులు ఖమ్మం పాటి శంకర్ మాట్లాడుతూ..హిమాచల్ ప్రదేశ్‌లో ఎస్ఎఫ్ఐ కార్యకర్త కామ్రేడ్ సియా గులేరియా హత్యను ఖండిస్తూ, దేశవ్యాప్తంగా మహిళా విద్యార్థుల భద్రతను కాపాడాలని కోరారు.హిమాచల్ ప్రదేశ్‌లో ఎస్ఎఫ్ఐ కార్యకర్త కామ్రేడ్ సియా గులేరియా హత్యను ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండిస్తోంది. ఈ ఘటనపై వెంటనే సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తోంది. 19 ఏళ్ల బీబీఏ విద్యార్థిని అయిన కామ్రేడ్ సియా గులేరియా కాలేజీకి వెళ్తున్న సమయంలో పగటి పూటనే దారుణంగా హత్యకు గురైంది. బైక్‌పై ఆమెను వెంబడించిన ఇద్దరు వ్యక్తులు ఆయుధాలతో దాడి చేసి ఆమెను హతమార్చారు. నిందితులు మత్తు పదార్థాల ప్రభావంలో ఉన్నట్లు, డ్రగ్ అడిక్టులుగా గుర్తించబడ్డారు. ఈ ఘటన మహిళల భద్రతపై పెద్దఎత్తున హామీలు ఇచ్చిన హిమాచల్ ప్రదేశ్ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాన్ని బహిర్గతం చేస్తోంది. యువతలో పెరుగుతున్న మత్తు పదార్థాల ప్రభావాన్ని వేరుగా చూడలేం. ఇది మాఫియా, డ్రగ్ డీలర్లు మరియు పాలక వర్గాల మధ్య ఉన్న విస్తృత నెక్సస్‌తో ముడిపడి ఉన్న సమస్యగా చూడాలి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం గత దశాబ్దంలో దేశవ్యాప్తంగా మహిళలపై నేరాలు ఆందోళనకరంగా పెరిగాయి. 2022 తర్వాత పూర్తి గణాంకాలు లేనప్పటికీ, ఇటీవల దేశంలోని వివిధ ప్రాంతాల్లో విద్యార్థినులపై అత్యాచారాలు, హత్యలు, వేధింపులు పెరుగుతున్నాయి. ఇది మహిళలు ప్రజా, విద్యా గృహ రంగాలలో ఎదుర్కొంటున్న అసురక్షిత పరిస్థితిని స్పష్టంగా చూపిస్తోంది. విద్య మరియు ఉపాధి అవకాశాలను సృజనాత్మకంగా పెంపొందించడంలో ప్రభుత్వాలు విఫలమవడంతో యువత మత్తు పదార్థాల వైపు మళ్లుతున్నారు. అంతేకాకుండా, మనువాద భావజాలం సమాజాన్ని వెనుకబడిన, మహిళలను అణగదొక్కే దిశగా నడిపిస్తోంది. కేంద్ర ప్రభుత్వం మరియు రాష్ట్రాలలో కాంగ్రెస్/బీజేపీ ప్రభుత్వాలు నేరస్తులకు అనుకూలంగా చట్టపరమైన వ్యవస్థను సడలించాయి. దీని వల్ల మహిళలు విద్య, ఉపాధి మరియు సామాజిక పురోగతిలో మరింత వెనుకబడుతున్నారు.మహిళా విద్యార్థుల భద్రతను దేశవ్యాప్తంగా అత్యవసర అంశంగా పరిగణించి కఠిన చర్యలు తీసుకోవాలి. నిందితులను కఠినంగా శిక్షించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం సమగ్ర విధానాలు అమలు చేయాలి.ఈ కార్యక్రమంలో డి.వై. ఎఫ్.ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ కో కన్వీనర్ కుంచం కావ్య , ఎస్. ఎఫ్. ఐ నల్లగొండ డివిజన్ కార్యదర్శి మారుపాక కిరణ్ ఆదిల్, లోకేష్ మమత,స్వప్న, కళ్యాణి స్పందన,శిరీష,కల్పన, రాధిక, అంజలి, దేవి తదితరులు పాల్గొన్నారు.

# బీసీల బడ్జెట్ పెంచక పోవడం, బీసీ సబ్ ప్లాన్ అమలు చేయకపోవడాన్ని తీవ్రంగా ఖండించిన ఎన్.ఆర్.ఐ బీసీ సెల్ అధ్యక్షుడు కిరణ్ కుమార్ దూదిగామ



నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 16 (వార్తా వేదిక సూర్య )

ఎన్.ఆర్.ఐ బీసీ సెల్ అధ్యక్షుడు దూదిగామ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో లండన్ లో జరిగిన సమావేశంలో, ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా బీసీల బడ్జెట్ పెంచకుండా, బీసీ సబ్ ప్లాన్ ని అమలు చేయకుండానే చర్చలు జరిగిన తీరు, బీసీ లకి అధికార పక్షం, ప్రతి పక్షాలు మోసం చేస్తున్న తీరు పట్ల తీవ్రంగా ఖండించడం జరిగింది. ఈ సందర్భంగా ఎన్ . ఆర్.ఐ బీసీ సెల్ అధ్యక్షుడు కిరణ్ కుమార్ దూదిగామ మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశంలో బీసీల సంక్షేమం పై చర్చించకుండా, 60% ఉన్న బీసీ లకు తగినంత బడ్జెట్ కేటాయించకుండా, బీసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్ నిధులు చెల్లించకుండా, బీసీ సబ్ ప్లాన్ పై, రిజర్వేషన్లపై చర్చించకుండా చేయటం సామాజిక న్యాయానికి విరుద్ధమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఇచ్చిన ఎన్నికల హామీ అయిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ను అమలు పరిచి, చట్ట సభల్లో బీసీలకు చట్ట సభల్లో సముచిత ప్రాధాన్యం ఇవ్వాలని, కనీసం 27% రిజర్వేషన్ ను రాజ్యాంగ సవరణ ద్వారా అమలు చేయాలని, కనీసం 20 వేల కోట్ల బడ్జెట్ ను ప్రతి ఏటా కేటాయించాలిని డిమాండ్ చేసారు. బీసీ ల పట్ల ప్రభుత్వానికి, ప్రతిపక్షాలకు బీసీ లకు మేలు చేయాలనే చిత్త శుద్ధి లేదని మండి పడ్డారు. జనాభా ప్రాతిపదికన వెంటనే బీసీ ల వాటా అందించాలని, కుల గణన ఆధారంగా ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు చేయాలని డిమాండ్ చేసారు. ఈ ప్రభుత్వం బీసీ సమాజం పై అంకెల గారడీ తప్ప అభివృద్ధి శూన్యం అన్నారు. ఇకనైనా ప్రభుత్వం మేల్కొని వెంటనే బీసీ లకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని లేకపోతే బీసీ ల ఆగ్రహానికి గురి అయి, రానున్న రోజుల్లో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని డిమాండ్ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో బీసీ ఎన్ ఆర్ ఐ ఉద్యమ సహచరులు వేణు కలకోట, నాగరాజు తౌటం పాల్గొన్నారు.



## చరణ్ శ్రీ ని అభినందించిన జిల్లా కలెక్టర్

నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 16 (వార్తా వేదిక సూర్య )

డా. బాబు జగ్జీవన్ రామ్, డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతులు సందర్బంగా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ వసతి గృహాలలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఉపన్యాస పోటీలలో " బాబాసాహెబ్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ ల ప్రభావం - మారిన బడుగు వర్గాల బతుకు చిత్రం" అనే అంశం పై , నల్లగొండ జిల్లా లోని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ బాలికల కళాశాల (ఓల్డ్) వసతి గృహానికి చెందిన చరణ్ శ్రీ , రాష్ట్ర వ్యాప్తంగా మొదటి బహుమతి పొంది, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేతులు మీదుగా (రూ. 5000/- మొదటి బహుమతి అందుకున్న సంధర్బంగా), గురువారం జిల్లా కలెక్టర్ చరణ్ శ్రీ కి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమములో బి. శశికళ, డిప్యూటీ డైరెక్టర్, ఎల్. సుమలత, వసతి గృహ సంక్షేమాధికారి పాలుగొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం(టి. యు. ఎఫ్) నల్లగొండ జిల్లా మహిళా అధ్యక్షురాలుగా దుబ్బ కొండమ్మ నియామకం

నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 16 (వార్తా వేదిక సూర్య )



తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ( టి. యు. ఎఫ్) మహిళా విభాగశీ అధ్యక్షురాలుగా నల్గొండ పట్టణానికి చెందిన దుబ్బ కొండమ్మ ను టి . యు.ఎఫ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాసరావు నియమించారు. ఈ నియామక పత్రాన్ని రాష్ట్ర ఉపాధ్యక్షుడు, దాసరి వెంకన్న, ఉమ్మడి జిల్లా కన్వీనర్ అప్పల మధు, జిల్లా అధ్యక్షుడు కె శ్రీనివాస్ లు నల్గొండ జిల్లా కేంద్రంలో నియామక పత్రాన్ని దుబ్బ కొండమ్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు వలికి వెంకటేశం, నిరుద్యోగ జేఏసీ నాయకులు వలికి క్రాంతి కుమార్ , సీనియర్ నాయకులు వట్టి కోటి బిక్షం, టి . యు.ఎఫ్ నార్కట్పల్లి మండల అధ్యక్షుడు కత్తుల దాస్, ధన మూర్తి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# మేనిఫెస్టోలోని హామీలను నెరవేర్చాలి

## టి. జి.ఈ. జె.ఎ.సి నల్లగొండ

### మే 5 తర్వాత ఉధృతం కానున్న ఉద్యమం




నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 16 (వార్తా వేదిక సూర్య )

ఈ టి.ఎస్.యు.టి.ఎఫ్ నల్లగొండ జిల్లా కార్యాలయంలో టి. జి.ఈ.జె.ఎ.సి తెలంగాణ ఉద్యోగ, గెజిటెడ్ అధికారుల, ఉపాధ్యయుల, కార్మిక మరియు పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ నిర్వహించిన విలేకరుల సమావేశంలో సుంకరి బిక్షం గౌడ్ టి. జి.ఈ.జె.ఎ.సి సెక్రటరీ, మారం అంజిరెడ్డి ఎగ్జిక్యూటివ్ మెంబర్, రాజశేఖర్ రెడ్డి టి యస్ యుటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో గత కొంతకాలంగా విడివిడిగా ఉన్న సంఘాలు తమ సమస్యల సాధన కోసం ఏకమై జేఏసీ గా ఏర్పడినవి. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా ఉపాధ్యాయ ఉద్యోగ కార్మికుల సమస్యల పరిష్కారం చేయాలని, తెలంగాణ రాష్ట్రంలోని 15.25 లక్షల ఉద్యోగుల యొక్క 206 సంఘాలు ఉద్యోగ ఉపాధ్యాయుల దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న (4) ప్రధాన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ దశల వారి పోరాటంలో భాగంగా రేపు అనగా 17.04.2026 న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన నిర్వహించి కలెక్టర్ ద్వారా వినతి పత్రాలు చేస్తామని అన్నారు. ఈనాటికి ఉద్యోగ విరమణ చేసిన 206 ఉద్యోగ ఉపాధ్యాయుల్లో తమ బెనిఫిట్స్ అందక మరణించారని ఇది ఉద్యోగులకు ఎంతో మనోవేదన కలుగజేస్తుందని అన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయుల ప్రధానమైన ఈ 4 డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అన్నారు.

1. తెలంగాణ రాష్ట్ర 2వ పిఆర్సి కమిషన్ రిపోర్ట్ తెప్పించి జూన్ 2 లోపు అమలు చేయాలి.

రాష్ట్ర ప్రభుత్వం 2 వ పిఆర్సి కమిటీ ఏర్పాటు చేసి దాదాపుగా 30 నెలలు పూర్తి అయిన నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు 51% ఫిట్మెంటుతో తెలంగాణ లో 2వ పి.ఆర్.సి ని అమలు చేయాలని, పి.ఆర్.సి కాలాన్ని ఎట్టి పరిస్థితుల్లో పొడిగించొద్దని పిఆర్సి. నివేదికను వెంటనే తెప్పించి, జూన్ 2 లోపు అమలు చేయాలి.

2. పెండింగ్ బిల్లుల విడుదల:

ప్రభుత్వం పెండింగ్ బిల్లులు నెలకు 700 కోట్లు విడుదల చేసినప్పటికీ, రాష్ట్రంలో నెలకు సగటున 600 మంది ఉద్యోగులు రిటైర్ అవుతుండటంతో బకాయిలు భారీగా పేరుకుపోతున్నాయి. కావున ఏక మొత్తంగా పెండింగ్ లో ఉన్న రూ.13000 కోట్లను వెంటనే ఏక మొత్తంగా విడుదల చేయాలి.

3. ఉద్యోగుల, పెన్షనర్ల ఆరోగ్య కార్డుల మంజూరు:

ఉద్యోగుల ఆరోగ్య కార్డులపై మంత్రివర్గ ఉప కమిటీ ఇప్పటికీ నిర్ణయం తీసుకొన్నప్పటికి దీన్నీ వెంటనే అమలు చేస్తామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పలుమార్లు టి. జి.ఈ. జె.ఎ.సి తో జరిపిన సమావేశాలలో చెబుతున్నప్పటికీ అమలు కావడంలేదు.దీనివల్ల ఉద్యోగులు పెన్షనర్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్త ఈ . హెచ్.ఎస్ స్కీం విధ విధానాలను వెంటనే రూపొందించి, మే 1 వ తేది నుండి ఉద్యోగులు మరియు పెన్షనర్లకు వైద్య సేవలు అందించేలా తక్షణ చర్యలు తీసుకోవాలి.4. ఎ) రాష్ట్రంలో కాంట్రిబ్యూషన్ పెన్షన్ (సి. పి. ఎస్)ను రద్దుచేసి పాత పెన్షన్ స్కీం (ఓ. పి. ఎస్) ను పునరుద్ధరణ చేయాలి. 01/09/2004 కంటి ముందు నోటిఫికేషన్ ద్వారా నియమితులైన ఉద్యోగులకు వెంటనే పాత పెన్షన్ స్కీం (ఓ. పి. ఎస్) ను అమలు చేయాలి. ఈ 4 ప్రధాన డిమాండ్ లతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబందించిన, మిగిలిన దీర్ఘకలికంగా ఉన్న (64)అంశాలలో పెండింగ్ లో ఉన్న వాటిని సత్వరమే పరిశీలించి పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం కాని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని వారు ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జె.శేఖర్ రెడ్డి, యాకుబ్ నాయక్, కాలం నారాయణరెడ్డి, నర్రా శేఖర్ రెడ్డి, నిమ్మనగోటి జనార్ధన్,మేకల జాన్ రెడ్డి, యడ్ల సైదులు,తరాల పరమేష్, ఎస్ ఆంజనేయులు, గేర నరసింహ, నలపరాజు వెంకన్న, సిహెచ్ లింగయ్య, కే మనోజ్ ప్రదీప్, వంగూరు విజయ కృష్ణ, బి సైదులు నాయక్, బి రవి నాయక్, డి ఐ రాజు, రణదీవే, వి. భాస్కర్, సత్యనారాయణ, మహమ్మద్ హనీఫ్, మురలయ్య, కె. సైదులు, పి. సైదులు, రవీందర్, భాను ప్రకాష్, యన్. సైదులు, మధు తదితరులు పాల్గొన్నారు.



## ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన వసంత పాటేల్

నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 16 (వార్తా వేదిక సూర్య )

నల్లగొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా వసంత్ పాటేల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసే బదిలీపై నల్లగొండ జిల్లాకు విచ్చేసిన వసంత్ పాటేల్ కి నల్లగొండ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలకడం జరిగింది.కొత్తగూడెం నుండి నల్లగొండ జిల్లాకు విచ్చేసిన ప్రధాన న్యాయమూర్తి వసంత్ పాటేల్ కి బార్ అసోసియేషన్ హాల్లో స్వాగత సభను ఏర్పాటు చేసి వారికి సాదరంగా ఆహ్వానించి పూల బొకే లతో స్వాగతం పలకడం జరిగింది. ఇదే సందర్భంలో నల్లగొండ జిల్లా మహిళా కోర్టు జడ్జిగా/4వ అదనపు జిల్లా జడ్జిగా పనిచేస్తున్న కే.కవిత గారికీ, పదోన్నతి కల్పిస్తూ ఇదే నల్లగొండ జిల్లాలో మొదట అదనపు జిల్లా జడ్జిగా బాధ్యతలు స్వీకరించడం జరిగింది. వారిని కూడా బార్ అసోసియేషన్ ఘనంగా సత్కరించడం జరిగింది.గతంలో వసంత్ పాటేల్ సూర్యాపేట భువనగిరి, వికారాబాద్, మహబూబాబాద్ లలో న్యాయమూర్తిగా పనిచేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి వసంత్ పాటేల్ మాట్లాడుతూ ఇక్కడి న్యాయవాదులను సమన్వయం చేసుకొని కక్షిదారులకు సత్వర న్యాయం అందించే విధంగా కృషి చేస్తానని వారన్నారు. జిల్లా న్యాయస్థానం ఆవరణంలో పెండింగ్ లో ఉన్న మౌలిక వసతులను పూర్తి చేస్తానని స్పష్టం చేశారు. న్యాయవాదులకు సంబంధించిన వృత్తిపరమైన సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని వారన్నారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏ సతీష్ కుమార్, ప్రధాన కార్యదర్శి బి అశోక్ కుమార్, ఉపాధ్యక్షులు పజూరి స్వామి గౌడ్,నూకల సంధ్యారాణి, సహాయ కార్యదర్శి సూరేపల్లి అమరావతి, కోశాధికారి ఎండి ఫిరోజ్, గేమ్స్ సెక్రటరీ ఎన్ ప్రసన్నకుమార్, లైబ్రరీ సెక్రటరీ రామకృష్ణ,సభ్యులు గుర్రం వెంకటరెడ్డి, జెనిగల రాములు, పందుల సైదులు కేఎన్ కుమార్,నాంపల్లి భాగ్యమ్మ ఎం.ప్రగతి దువ గీత మరియు సీనియర్ న్యాయవాదులు కట్టా ఆనంత రెడ్డి జి.జవహర్ లాల్, జీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.




## రైతు వ్యతిరేక విధానాలను విడనాడాలి

### : సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం

### మోడీ ప్రజా వ్యతిరేక విధానాలపై కార్మిక వర్గం పోరాటానికి సిద్ధం కావాలి

గట్టుప్పల్ ఏప్రిల్ 16 వార్త వేదిక సూర్య

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతువ్యతిరేక విధానాలను విడనాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం అన్నారు. గురువారం చండూరు మండల కేంద్రంలో సిపిఎం మండల కమిటీ సమావేశం చిట్టిమల్ల లింగయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,నరేంద్ర మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా వ్యతిరేక విధానాలు వేగంగా అమలు చేస్తుందని విమర్శించారు. రైతాంగం కార్మిక వర్గం తమ హక్కుల కోసం పోరాడుతుంటే ఇవేమీ పట్టించుకోకుండా కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా వ్యవహరిస్తుందన్నారు. వారి లాభాల కోసమే ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటుపరం చేస్తుందన్నారు. బ్రిటిష్ కాలం నుండి పోరాడి సాధించుకున్నటువంటి 44 కార్మిక చట్టాలలో 29 చట్టాలను 4 లేబర్ కోడ్స్ మార్పు చేయడం దుర్మార్గమన్నారు. ఈ కోడ్స్ అమలు జరిగితే కార్మికులు బానిసలుగా మారతారని అన్నారు.ఈ కోడ్స్ వల్ల కార్మికులు సమ్మె చేసే హక్కు,సంఘం పెట్టుకునే హక్కు, జీతభత్యాల కోసం భేరసారాల హక్కు కోల్పోతారన్నారు. పనిగంటలు విపరీతంగా పెరుగుతాయన్నారు. వెంటనే నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఐకెపి కేంద్రాలకు వరి ధాన్యాన్ని తెచ్చి 20 రోజులు కావస్తున్న నేటికి ధాన్యానికి కాంటాలు వేయకపోవడంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఐకెపి కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేసి, వచ్చిన ధాన్యాన్ని వచ్చినట్లు కాంటాలు వేయాలన్నారు. అకాల వర్షాలు వస్తే ధాన్యం తడిసిపోయే ప్రమాదం ఉందని, ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని ఆయన అన్నారు.

మే 1న జరిగే మేడే దినోత్సవాన్ని అన్ని రంగాల కార్మికులు తప్పనిసరిగా పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం చండూరు మండల కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ, సిపిఎం సీనియర్ నాయకులు, మండల కమిటీ సభ్యులుచిట్టిమల్ల లింగయ్య,రైతు సంఘం మండల కార్యదర్శి ఈరటి వెంకటయ్య, సిపిఎం మండల కమిటీ సభ్యులు కొత్తపల్లినర్సింహా, గౌసియా బేగం తదితరులు పాల్గొన్నారు

## వాటర్ ప్లాంట్‌ను నిర్మించాలి

యాదాద్రి భువనగిరి ఏప్రిల్ 16 వార్తా వేదిక సూర్య



వాటర్ ప్లాంట్ పునరుద్దించాలి భువనగిరి పట్టణంలో 9వ వార్డులను సింగనగూడంలో వాటర్ ప్లాంటును పునర్దించాలని

సిపిఐ ఎం పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ అన్నారు. గురువారం ఆయన వాటర్ ప్లాంట్ పరిశీలించారు. వాటర్ ప్లాంట్ ప్రారంభించి 10 సంవత్సరాలు అవుతున్నది రెండు మూడు సంవత్సరాల నుండి వాటర్ ప్లాంట్ రిపేరు చేయలేక కరెంట్ బిల్లులు కట్టలేక ప్లాంటు మూసి వేయడం జరిగింది ప్రస్తుతం ఉన్న కౌన్సిలర్ గారు వాటర్ ప్లాంట్ పునరుద్ధరించి ప్రజలకు మంచినీళ్లు అందించాలని సిపిఎం పార్టీ కోరుతున్నది బైపాస్ రోడ్డు దాటి వెళ్లాలంటే మంచినీటి కోసం ప్రాణాలను అరి చేతిలో పెట్టుకొని రోడ్డు దాటవలసి పరిస్థితి ఉన్నది కావున వెంటనే వాటర్ ప్లాంట్ ను రి ఓపెనింగ్ చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరుతున్నాం ఈ కార్యక్రమంలో పట్టణ సెక్రటేరియట్ సభ్యుడు గంధ మల్ల మాతయ్య; చింతల శివ; మన్నె రమేష్; మన్నె రాజు; చింతల ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలల ద్వారా ఉత్తమ ఫలితాల సాధనకు ప్రిన్సిపల్స్ కృషి చేయాలి

### జిల్లా కలెక్టర్ బి .చంద్రశేఖర్

నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 16 (వార్తా వేదిక సూర్య )



ప్రభుత్వ జూనియర్ కళాశాలల ద్వారా ఉత్తమ ఫలితాల సాధనకు ప్రిన్సిపల్స్ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి .చంద్రశేఖర్ ఆదేశించారు. గురువారం ఆయన ఇటీవల విడుదలైన ఇంటర్ పరీక్ష ఫలితాల పై విశ్లేషణ తో పాటు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేపట్టిన పనుల పురోగతి పై జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి, ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ తో కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు.ఇటీవల విడుదలైన ఇంటర్ పరీక్ష ఫలితాలలో కొన్ని ప్రభుత్వ కళాశాలల్లో ఫలితాలు బాగున్నాయని, మరికొన్ని కళాశాలల్లో తక్కువగా ఉన్నాయని ,అలా కాకుండా జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మంచి ఫలితాలు వచ్చేలా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నదని, అందులో భాగంగానే వచ్చేవిద్యా సంవత్సరం నుండి ఇంటర్మీడియట్ విద్యార్థులకు సైతం మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయనున్న దృష్ట్యా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వచ్చే విద్యా సంవత్సరానికి ఎక్కువ మొత్తంలో ప్రవేశాలు జరిగేలా చూడాలన్నారు. ఈ సంవత్సరం ఫలితాలు తక్కువగా వచ్చిన కళాశాలల్లో ప్రత్యేకించి ఫెయిల్ అయిన విద్యార్థులపై విశ్లేషణ నిర్వహించి ఈనెల 17 నుండే రెమిడీయల్ తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. సబ్జెక్టులు తప్పిపోయిన విద్యార్థులు సప్లమెంటరీ పరీక్షలకు హాజరయ్యేందుకు తక్షణమే ఫీజు చెల్లించేలా తల్లిదండ్రులకు సమాచారం అందించాలని, ఈ విషయమై ఈ నెల 17న విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలని చెప్పారు.జిల్లాలో పదవ తరగతి తో ఏ విద్యార్థి ఆగిపోకుండా ఇంటర్లో ప్రవేశం పొందేలా అందరూ పని చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఎక్కడైనా విద్యార్థులు ఫెయిల్ అయినచోట అందుకు గల కారణాలను విశ్లేషించాలని, వారు తిరిగి సప్లమెంటరీ ద్వారా పాస్ అయ్యేందుకు అవసరమైన మెటీరియల్ అందించాలని, పరీక్షల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, ఇందుకు షెడ్యూల్ ను రూపొందించాలని, ఏ సబ్జెక్టులో ఎక్కువమంది ఫెయిలయ్యారో గుర్తించి సబ్జెక్టుల వారిగా సంబంధిత లెక్చరర్స్ తో తరగతులు నిర్వహించేలా కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని ఆదేశించారు. ప్రిన్సిపల్స్ తో పాటు, లెక్చరర్ లందరూ ఇంటర్మీడియట్ పరీక్షలను సీరియస్ గా తీసుకోవాలని, బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని, అన్ని కళాశాలల్లో రెమిడీయల్ తరగతులు నిర్వహించాలని, తరగతుల వారిగా , సబ్జెక్టు వారి గా విశ్లేషణ చేయాలని , తప్పనిసరిగా పాస్ అవుతామనే భరోసాను విద్యార్థులలో కల్పించాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎఫ్ ఆర్ ఎస్ ను ఆక్టివేట్ చేయాలని, వచ్చే విద్యా సంవత్సరం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎక్కువ మంది విద్యార్థులు చేరే విధంగా పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాలని, పదవ తరగతి చదివిన విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని, ప్రత్యేకించి కళాశాల వారిగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి ప్రచారం నిర్వహించాలని చెప్పారు.ఆయా కళాశాలల్లో చేపట్టిన పనులు, వాటి నిర్వహణ, శానిటేషన్, డ్రింకింగ్ వాటర్, ఫర్నీచర్ తదితర పనులపై ఆయన కళాశాల వారీగా సమీక్ష నిర్వహించారు. పనులు పూర్తయిన చోట యుటిలైజేషన్ సర్టిఫికెట్లను తక్షణమే ఇవ్వాలని, తాగునీరు ,శానిటేషన్, ఫర్నిచర్ తదితర పనులన్నీ 15 రోజుల్లో పూర్తి అయ్యేలా చూడాలని, మధ్యాహ్న భోజనం వండేందుకు ముందే కిచెన్ చూసుకోవాలని ఆదేశించారు. కాగా ఈ సంవత్సరం విడుదలైన ఇంటర్ పరీక్ష ఫలితాలలో నల్గొండ జిల్లా ఇంటర్ మొదటి సంవత్సరం 62.81 శాతం సాధించి రాష్ట్రంలో 14వ స్థానంలో నిలువగా, రెండవ సంవత్సరం ఫలితాలలో 73.69 శాతాన్ని సాధించి 12వ స్థానంలో నిలిచింది.ఈ సందర్భంగా నల్గొండ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల లో 1000 మార్కులకు గాను, 974 మార్కులు సాధించిన ఎన్. రిషితను ,అలాగే ఇంటర్ మొదటి సంవత్సరంలో 500 మార్కులకు గాను 481 మార్కులు సాధించిన ఎస్. చందనను,438 మార్కులు సాధించిన తుబా ఫర్వీన్ లను జిల్లా కలెక్టర్ శాలువా, పూల బొకేతో సన్మానించారు.జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి దస్రు నాయక్, జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి ఉన్నారు.

## టి . యు.ఎఫ్ రాష్ట్రస్థాయి విస్తృత సమావేశాన్ని విజయవంతం చేయండి

### టి.యు. ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాసరి వెంకన్న


నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 16 (వార్తా వేదిక సూర్య )



ఈనెల 18 న హైదరాబాదులో జరిగే తెలంగాణ ఉద్యమకారుల ఫోరం(టి. యు. ఎఫ్) రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశాన్ని వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని టి . యు.ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాసరి వెంకన్న పిలుపునిచ్చారు, నల్గొండ జిల్లా అధ్యక్షుడు కె. శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారుల అజెండాతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం మూడు సంవత్సరాలు కావస్తున్న ఇంతవరకు ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని,ఇప్పటికైనా తమ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా 6 గ్యారెంటీలలో భాగంగా ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా కన్వీనర్ అప్పల మధు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా మహిళా అధ్యక్షురాలు దుబ్బ కొండమ్మ, జిల్లా కమిటీ సభ్యులు వల్కి వెంకటేశం, నిరుద్యోగ జేఏసి నాయకులు వల్కి క్రాంతి కుమార్, టి.యు.ఎఫ్ నార్కట్పల్లి మండల అధ్యక్షుడు కత్తుల దాస్,సీనియర్ ఉద్యమ నాయకులు వట్టికోటి బిక్షం,ధనమూర్తి,క్రిష్ణ వేణి పాల్గొన్నారు.

## 9 వ రోజు కొనసాగిన టి విఏఈ జెఏసి దీక్ష

నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 16 (వార్తా వేదిక సూర్య )



టి . వి.ఏ.ఈ జె . ఏ.సి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 9 వ రోజ నిరవధిక సమ్మెలో భాగంగా ప్రభుత్వం మరియు యాజమాన్యం కార్మికులను సమస్యలపై స్పందించకుండా, వారిని టెర్మినేట్ చేస్తామని, భయభ్రాంతులకు గురి చేయడం చేసిన వారి మొండి వైఖరిని ఖండిస్తూ, కార్మికులు వారి బెదిరింపులకు గురికాకుండా అధిక సంఖ్యలో పాల్గొని 9 వ రోజు దీక్షను విజయవంతం చేయడం జరిగింది. గురువారం బిజెపి జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి వచ్చి సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం వ్యవహరిస్తున్న వ్యతిరేక విధానాలను వెంటబెడుతూ కార్మికులకు రావలసిన న్యాయమైన డిమాండ్లను వారికి ఇచ్చే విధంగా మా పార్టీ తరపున మీకు పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా 8 వ రోజు మేనేజ్మెంట్ జేఏసీ తో చర్చలు జరిపిన విఫలం కావడంతో ఒక కార్మికుడు గోడ కొమ్మలు అనే వ్యక్తి మనస్థాపంతో గుండె పోటు రావడంతో చనిపోవడం జరిగింది. ఈరోజు వారికి ఆత్మకు శాంతి కలగాలని ఒక రెండు నిమిషాలు మౌనం పాటించి గురువారం దీక్షలో 12 మంది ఒకరోజు నిరాహార దీక్ష లో అర్థ నగ్న ప్రదర్శన చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జిట్టబోయిన లింగస్వామి జిల్లా నాయకులు లింగారెడ్డి, పెరుమాల్ల మురళి , విశ్వం,వేణుగోపాల్ రెడ్డి, బొప్పాని యాదయ్య,గణేష్ ,అద్దంకి వెంకన్న, పోతపాక విజయ్ కుమార్, కోటి,విజయ్ రెడ్డి,పరమేష్ ,ఉపేందర్,రమేష్,వెంకన్న ,లచ్చిరెడ్డి ,వెంకట్ రెడ్డి,పెరిక శేఖర్ ,రఫియా, ప్రసన్నకుమార్,అరుణ,లక్ష్మి, శైలజ,రాజేష్, మైల సైదులు నాగమణి, కరుణ,కళావతి,ఆరీఫా,భారతి,నాగార్జున మరియు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## భారతదేశం ఒక లౌకిక దేశము అన్ని మతాలను సమానంగా గౌరవించే దేశము

### 1950 నాటి రాష్ట్రపతి ఉత్తర్వులు రద్దు చేసేవరకు పోరాటం ఆగదు

### భారత ప్రభుత్వం రంగనాథ్ మిశ్రా కమిషన్ నివేదికను వెంటనే అమలుచేయాలి

### తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్ బిషప్ దుర్గం ప్రభాకర్

### రెవ. డా. మెసా దేవసహాయం - హుజూర్నగర్ అధ్యక్షులు

### రెవ. డా. జలగం జేమ్స్ - సూర్యాపేట అధ్యక్షులు

నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 16 (వార్తా వేదిక సూర్య )




హుజూర్నగర్ మున్సిపాలిటీ కేంద్రం, అభిషేక్తుని ప్రార్థన మందిరం చింతల బజారు నందు జిల్లా నాయకులు పాస్టర్ ఉటుకూరి రాజు ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ కార్యక్రమం ఏర్పాటు చేయగా ఈ కార్యక్రమునకు ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిషప్ దుర్గం ప్రభాకర్ పాల్గొని మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు ఎస్సి హోదా కల్పించాలని, అది రాజ్యాంగం కల్పించిన హక్కు గా డిమాండ్ చేశారు.గతంలో భారత ప్రభుత్వం రంగనాథ్ మిశ్రా జాతీయ కమిషన్ (2004)ను ఏర్పాటు చేసిందనీ మాజీ సీజేఐ రంగనాథ్ మిశ్రా అధ్యక్షతన, ఇది 2007లో దళిత క్రైస్తవులు వివక్షను ఎదుర్కొంటున్నారని నివేదికను ప్రభుత్వంనకు సమర్పించారనీ దానిని వెంటనే అమలు చెయ్యాలని డిమాండ్ చేశారు. మరియు 1950 నాటి రాష్ట్రపతి ఉత్తర్వులు ఎస్సీ హోదాను హిందూ, సిక్కు, బౌద్ధ మతం వారికి మాత్రమే పరిమితం చేయడం దళిత క్రైస్తవులకు అన్యాయం చేయడం ఒక్కటే అనీ భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కూ15, 16,19, 21, 32 రాజ్యాంగ విరుద్ధం అనీ అన్నారు,రోజు రోజుకు భారతదేశం లో దళిత క్రైస్తవులను అణచివేస్తూ, అర్ధకంగా, మానసికంగా దెబ్బతీస్తూన్నారని, ముఖ్యంగా రెడ్డి, ఖమ్మ, కాపు, వెలమ, బి. సి అన్నీ ఉపకులాలు క్రైస్తవ మతం మారితే అదే కులం అనుసరిస్తున్నారనీ ఆలాగే దళిత క్రైస్తవులకు కూడా వర్తింప చేయాలనీ డిమాండ్ చేస్తున్నామన్నారు.వాళ్ళకు ఇచ్చిన మత స్వేచ్ఛను దళిత క్రైస్తవులకు కూడా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు,దేశం లోని అన్నీ రాజకీయ పార్టీల వైఖరి కూడా తెలపాలని, త్వరలో అన్నీ రాజకీయ పార్టీల నాయకులను కలిసి ఎక్కడికి అక్కడే వినతి పత్రాలు ఇచ్చి వత్తిడి తేవాలని క్రైస్తవులకు పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమం లో బిషప్ ముల్లంగి జాకబ్ రాజు మెసా దేవసహాయం, జలగం జేమ్స్, తలకప్పల దయాకర్, మాతంగి పీటర్,రెవ. బొక్క ఏలీయా రాజు, రెవ. డా. డి. జాన్ ప్రకాష్, రెవ ఏర్పుల క్రిస్టోఫర్, రెవ. పంది మార్క్,పాస్టర్ కొండేటి లాజర్, పాస్టర్ ప్రేమ్ సాగర్,పిట్టల సామెల్,రెవ. సి. హెచ్. కిరణ్ కుమార్, రాపోలు పిలిఫ్, గుగులోత్ రవి నాయక్, కొత్తపల్లి జోసెఫ్. సంజీవ్ కుమార్, బండారు సొలొమోను, మామిడి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# దళిత రత్న అవార్డు అందుకున్న ఉదయ్



మోత్కూరు, ఏప్రిల్ 16 (వార్త వేదిక సూర్య ): విద్యార్థి యువజన ప్రజా సమస్యలే పరిష్కారంతో పాటు దళిత జాతి అభివృద్ధికై నిరంతరం కృషి చేస్తున్న తనను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి దళిత రత్న అవార్డు ఎంపిక చేసి అవార్డు ఇవ్వడం పట్ల మోత్కూరు పట్టణానికి చెందిన కూరెళ్ళ ఉదయ్ సంతోషం వ్యక్తం చేశారు. గురువారం ఆయన మోత్కూరులో విలేకరులతో మాట్లాడుతూ తాను తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ (టి ఎస్ ఎస్ ఏ ) లో గ్రేటర్ హైదరాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా అణగారిన వర్గాల విద్యార్థుల కోసం గత కొన్నేళ్లుగా పోరాటాలు చేస్తున్నానని తెలిపారు.తన సేవలను గుర్తించి అంబేద్కర్ జయంతి ఉత్సవాల చైర్మెన్, రాష్ట సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, కు వైస్ చైర్మెన్ సుదర్శన్ బాబు చేతులమీదుగా ఈ నెల 15న రవీంద్ర భారతిలో దళిత రత్న అవార్డు అందించారని తెలిపారు. తన ఈ అవార్డు రావడానికి సహకరించిన టి ఎస్ ఎస్ ఏ వ్యవస్థాపక అధ్యక్షులు కూరెళ్ళ మహేష్ లకు ఉదయ్ కృతజ్ఞతలు తెలిపారు.

# భూధాన్ ఉద్యమ స్ఫూర్తి పాదయాత్ర ప్రారంభం

- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి




భూదాన్ పోచంపల్లి ఏప్రిల్ 16 ( వార్తావేదిక సూర్య) : భూదాన్ ఉద్యమ వ జ్రోత్సవాల సందర్భంగా కస్తూరి ప్రకృతి చికిత్సలయం శివరాంపల్లి లో భూదాన స్ఫూర్తి పాదయాత్రను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి గురువారం ప్రారంభించారు. పేదల కోసం పోచంపల్లి లో ప్రథమ భూదాత వెదిరి రామచంద్రారెడ్డి 100 ఎకరాలు దానం చేసిన మహనీయుడని కొనియాడారు. ఆచార్య వినోబాభావే చేపట్టిన పాదయాత్రతో 44 లక్షలు ఎకరాలు పేదలకు పంపిణీ చేయడం జరిగిందని, భూమితో పేదలు సాగు చేసుకుని బతుకుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం, మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు , సంఘమిత్ర సంస్థ నిర్వాహకులు ప్రొఫెసర్ తడక యాదగిరి , పట్నం కృష్ణకుమార్ , పోచంపల్లి బ్యాంక్ చైర్మన్ తడక రమేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భారత లవకుమార్ , నాయకులు చింతకింది రమేష్ , రాపోలు జ్ఞానేశ్వర్, కొయ్యడ నరసింహ,తడక లావణ్య, పట్నం పారిజాత, చక్రాల నరసింహ, పిల్లలమర్రి దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

# నిజాయితీ చాటుకున్న సెక్యూరిటీ సిబ్బంది శేఖర్



యాదగిరిగుట్ట ఏప్రిల్ 16 ( వార్త వేదిక సూర్య ) : యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయానికి దర్శనార్థం వచ్చిన హైదరాబాద్ కు చెందిన మహేష్ దర్శనం వెళ్లే సమయంలో కొండపైన బస్ స్టాప్ లో తన మొబైల్ ఫోను మర్చిపోయాడు. కొండపైన బస్ స్టాప్ లో అక్కడే విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది శేఖర్ అట్టి మొబైల్ ఫోను ను గమనించి మైక్ లో అనౌన్స్ చేపించి భక్తుని వివరాలు తెలుసుకొని భక్తునికి అప్పజెప్పాడు. అనంతరం శేఖర్ ను ఆలయ అధికారులు, ఎస్పిఎఫ్ అధికారులు, తోటి సిబ్బంది, భక్తులు, పలువురు అభినందించారు.

# ఎమ్మెల్యే కుంభం సమక్షంలో కాంగ్రెస్ లో చేరిక



భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 16 (వార్తా వేదిక సూర్య ): మండలంలోని శివారెడ్డి గూడెం గ్రామానికి చెందిన వారాల రేవంత్ రెడ్డి 50 మంది కార్యకర్తలతో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో గురువారం చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతు న్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్, జిల్లా నాయకులు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్ , సామ మధుసూదన్ రెడ్డి , మర్రి నర్సింహారెడ్డి , గ్రామ సర్పంచ్ బొక్క మల్లారెడ్డి ఉప సర్పంచ్ చిలుకల సంతోష్ యాదవ్, వారాల రామచంద్రారెడ్డి, నారి మహేష్, చిలుకల శివకుమార్, సరసాని కృష్ణవేణి,వారాల కరుణ, తదితరులు పాల్గొన్నారు.

# కల్లూరి వ్యాఖ్యలపై ఫైర్

▸▸ చైర్ పర్సన్ వాణి భరత్ గౌడ్



యాదగిరిగుట్ట ఏప్రిల్ 16 (వార్త వేదిక సూర్య ) : ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పై బిఆర్ఎస్ నాయకుడు కల్లూరి రామచంద్రారెడ్డి అర్థం లేని విమర్శలు, ఆరోపణలు చేస్తున్నారని యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్ పర్సన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం అన్నారు. గురువారం పట్టణంలోని బీర్ల నిలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. రాజపేట మండలం చల్లూరు క్రషర్ కంపెనీకి సంబంధించి బీర్ల ఐలయ్య పై ఆరోపణలు చేయడం తగదని అన్నారు. నారాయణ రావు అనే వ్యక్తి 2019 లోని క్రషర్ మైనింగ్ కంపెనీ ఏర్పాటు చేశారని అన్నారు. అప్పట్లో ఆ కంపెనీకి పర్మిషన్ ఇచ్చింది టిఆర్ఎస్ ప్రభుత్వమేనని అన్నారు. విద్యుత్ కనెక్షన్ ఇతర అనుమతులు ఇచ్చింది టిఆర్ఎస్ ప్రభుత్వం కాదా అని నిలదీశారు, 2023లో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగా ఆలేరు ఎమ్మెల్యేగా బీర్ల ఐలయ్య గెలుపొందారని అన్నారు. బీర్ల ఐలయ్య ఎమ్మెల్యే కాకముందు నుండే ఆ కంపెనీ నడుస్తుందని అన్నారు. కావాలని బడుగు బలహీన వర్గాల నాయకుడు బీర్ల ఐలయ్య పై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. పొంతనలేని విమర్శలు ఆరోపణలు చేయడం తగదని అన్నారు. బహిరంగ చర్చకు సిద్ధమని కల్లూరి రామచంద్రా రెడ్డి ప్రకటించడం ఆయన స్థాయికి తగదని అన్నారు. వార్డు మెంబర్ గా కూడా గెలవలేని కల్లూరి రామచంద్రారెడ్డి అనేక పార్టీలు మారారని అన్నారు. ఏ పార్టీలో నిలకడ లేని ఆయన ఐలయ్య పై విమర్శలు చేయడం తగదని అన్నారు. కల్లూరి రామచంద్ర రెడ్డికి కాంగ్రెస్ కార్యకర్తలు సరిపోతామని అన్నారు. ఆయన ఎక్కడికి వస్తారో చెప్తే కాంగ్రెస్ కార్యకర్తలము వచ్చి ఆయకు బుద్ధి చెబుతామని అన్నారు. ఇకపై బీర్ల ఐలయ్య పై లేనిపోని విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు అంతా కలిసి కల్లూరుని తరిమికొడతామని అన్నారు. టిఆర్ఎస్ నాయకులకు భయం పట్టుకుందని వారు మళ్ళీ అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదని అన్నారు. అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ ప్రజల్లో నిత్యం ఉండే బీర్ల ఐలయ్య పై ఏదో ఒక విమర్శ చేయాలని ఉద్దేశపూర్వకంగా చేస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బరిగే రమ్య రామచందర్, కౌన్సిలర్ బూడిద మధు, కాంగ్రెస్ టౌన్ పార్టీ అధ్యక్షులు బందారపు బిక్షపతి గౌడ్, అరుణ రాజేష్, కాల్నే భాస్కర్, మహమ్మద్ సలాం, గుడ్ల నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# యాదాద్రి వాసునికి నిత్య పూజలు

* స్వామివారి నిత్య రాబడి రూ.12.82 లక్షలు



యాదగిరిగుట్ట ఏప్రిల్ 16 ( వార్త వేదిక సూర్య ) : యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దివ్య క్షేత్రంలో ఆలయ అర్చకులు నిత్య ఆరాధనలు నిర్వహించారు. గురువారం స్వామివారి దర్శనానికి కుటుంబ సభ్యులతో వచ్చిన భక్తులు శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో జరిగే సువర్ణ పుష్పార్చన నిత్య కళ్యాణం వేద ఆశీర్వచనం సాయంత్రం జరిగిన వెండి మొక్కు జోడి సేవలు కొండకిందగల సత్యనారాయణ స్వామి వ్రతాలలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. కొండపైన అనుబంధాలయమైన శ్రీ పర్వత వర్ధిని సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వారిని భక్తులు దర్శించుకుని మొక్కు బడులు చెల్లించుకున్నారు. అనుబంధాలయమైన పాత గుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయాన్ని సందర్శించి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి నిత్య రాబడిలో భాగంగా గురువారం రోజున రూ. 12,82,284,వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధాన అర్చకులు మంగళగిరి నరసింహమూర్తి, ప్రశాంత్ చార్యులు, రామాచార్యులు, ఇన్చార్జి వెంకటేష్, ఎస్పీఎఫ్ సిబ్బంది మాణిక్ ప్రభు, మోహన్ రెడ్డి,పాండు,సూర్య నాయక్, దేవస్థాన సిబ్బంది కుమార్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# 18న తార్నాకలో ఉద్యమకారుల ఫోరం విస్తృతస్థాయి సదస్సు



రామన్నపేట;ఏప్రిల్ 16(వార్తా వేదిక సూర్య) : ఈనెల 18న తార్నాక చౌరస్తా నుండిమర్రి కృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్ వరకు భారీ ర్యాలీతో బయలుదేరి ఉద్యమకారుల ఆకాంక్షలను నెరవేర్చుకునేందుకు ప్రతి ఒక్క ఉద్యమకారుడు కంకణబద్ధులై కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజన్న,ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షుడు శీలం స్వామి పిలుపునిచ్చారు.గురువారం ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన ఉద్యమకారుల ఫోరం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం 25 వేల పింఛన్ ఇస్తామని మేనిఫెస్టోలో పొందుపరచిన అంశాలను సాధించేవరకు ప్రతి ఒక్కరు ఉద్యమ స్ఫూర్తితో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కదిరేని స్వామి, ఎదురుగట్ల యాదగిరి, మల్ల వెంకటేశం, కొండూరు సత్తయ్య, బొడిగె సుదర్శన్, ఐటిపాముల పుష్ప, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పీసీసీ మెంబెర్ జావిద్ మృతి

- సంతాపంగా భువనగిరి జిల్లా కేంద్రంలో నివాళులు......



భువనగిరి/వార్త వేదిక సూర్య : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పీసీసీ మెంబెర్ మహమ్మద్ జావీద్ ఆకస్మిక మరణం పట్ల భువనగిరి జిల్లా కేంద్రం లోని ప్రిన్స్ చౌరాస్తా వద్ద సేవాదళ్ ఆధ్వర్యంలో వారి చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించడం జరిగింది . ఈ సందర్భంగా పీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి, కొత్తకగూడెం భద్రాచలం అబ్జర్వర్ పోత్నాక్ ప్రమోద్ కుమార్, మైనారిటీ నాయకులు మహమ్మద్ అతహర్, సేవాదల్ ప్రధాన కార్యదర్శి పిట్టల బాలరాజ్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లా సీనియర్ నాయకులు కరుడుగట్టిన కాంగ్రెస్ వాది మహమ్మద్ జావిద్ పార్టీ కష్ట కాలంలో ఎన్నో సేవలు చేశారని కొనియాడారు.ఖమ్మం జిల్లాలో పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు పార్టీ కి అండగా నిలిచి నేడు పార్టీ అధికారంలో రావడంలో ఖమ్మం జిల్లాలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. అదేవిదంగా పార్టీ లో అంచెలంచెలుగా ఎదిగి నేడు పీసీసీ లో స్థానం సంపాదించిన నాయకులు జావిద్ అని అన్నారు. జావిద్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండాలని కోరారు. అదేవిదంగా దేవుడు వారి కుటుంబానికి ధైర్యం ఇవ్వాలని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియచేసారు. ఈ కార్యక్రమం లో సేవాదల్ పట్టణ అధ్యక్షులు 19 వ వార్డ్ ఇంచార్జి డాకూరి ప్రకాష్,సేవాదల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వాజీద్, మైనారిటీ సీనియర్ నాయకులు షరీఫ్,డీసీసీ ఉపాధ్యక్షులు చుక్క స్వామీ, శాదిఖానా చైర్మన్ ఏజాజ్, మాజీ కౌన్సిలర్ ఈరపాక నర్సింహా, బార్ అసోసియేషన్ అధ్యక్షులు విద్యాసాగర్,కాంగ్రెస్ నాయకులు జిన్నా మల్లేష్, గుర్రాల శ్రీనివాస్.శివ, దర్గాయి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఫిట్నెస్‌కు వెళ్తుండగా ఫైన్.. అధికారి ఉపాసిని లంచం డిమాండ్



మహేశ్వరం, ఏప్రిల్ 16వార్త వేదిక సూర్య: మహేశ్వరం మండల పరిధిలోని హర్షగూడ గ్రామానికి చెందిన ఇస్లావత్ బాలు నాయక్‌కు చెందిన లారీ (ట్రా29ఖ9639) ఫిట్నెస్ నిమిత్తం ఆర్టీఏ కార్యాలయానికి వెళ్తున్న సమయంలో ఆర్టీఏ అధికారిపై వివాదం చోటుచేసుకుంది. ఈ ఘటన తుక్కుగూడ వద్ద చోటుచేసుకోగా, సంబంధిత అధికారిపై లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.వాహన యజమాని తెలిపిన వివరాల ప్రకారం, ఏప్రిల్ 15 బుధవారం రోజున లారీ ఫిట్నెస్ కోసం ముందుగానే స్లాట్ బుక్ చేసుకుని డ్రైవర్ ఇస్లావత్ రాజేష్,ను మాన్యగూడలోని ఆర్టీఏ కార్యాలయానికి పంపించారు. ఈ క్రమంలో తుక్కుగూడ వద్ద అత్తాపూర్ ఆర్టీఏకి చెందిన అధికారి ఉపాసిని వాహనాన్ని ఆపి తనిఖీలు నిర్వహించారు.డ్రైవర్ వద్ద డ్రైవింగ్ లైసెన్స్ సహా వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు ఉన్నప్పటికీ, వివిధ కారణాలు చూపుతూ రూ.10,000 జరిమానా విధించారని యజమాని ఆరోపించారు. అంతేకాకుండా, డ్రైవర్ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని లంచం ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. లంచం ఇవ్వలేదనే కారణంతోనే జరిమానా విధించారని బాధితులు పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని కూడా వారు తెలిపారు.ఈ ఘటనతో వాహన యజమాని ఆందోళనకు గురయ్యాడు. “మేము వాహన ఫిట్నెస్ కోసం వెళ్తున్నప్పటికీ, అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నా అధికారులు దురుసుగా ప్రవర్తిస్తూ జరిమానాలు విధించడం బాధాకరం” అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఇటీవల ఆర్టీఏ అధికారులు చిన్న చిన్న కారణాలు చూపిస్తూ వాహనదారులకు జరిమానాలు విధిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో, ఇటువంటి ఘటనలపై ఉన్నతాధికారులు దృష్టి సారించి సంబంధిత అధికారిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని వాహన యజమాని కోరుతున్నారు.

యాదాద్రి భువనగిరి
సంపుటి : 1 సంచిక : 321
వార్త వేదిక సూర్య
యాదాద్రి భువనగిరి
శుక్రవారం,
ఏప్రిల్ 17, 2026

# మున్సిపల్ కో ఆప్షన్ పదవికి తీవ్ర పోటీ

- ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల
- 4 స్థానాలపై ఆశావహుల సంఖ్య అధికం.
- అధిష్టానం ఆశీస్సులు ఎవరి పైనో......?




మోత్కూరు ,ఏప్రిల్ , 16 (వార్త వేదిక సూర్య ); మోత్కూరు మున్సిపల్ కో ఆప్షన్ ఎన్నికకు సంబంధించి తాజాగా నోటిఫికేషన్ రావడంతో...కో ఆప్షన్ పదవులకై ఆశావహులలో ఉత్కంఠ నెలకొంది. దీంతో ఎమ్మెల్యే,ఎంపీ,పార్టీ ముఖ్య నాయకులతో పాటు మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మెన్ కౌన్సిలర్ల ను ప్రసన్నం చేసుకునేందుకు ఇప్పటికే ఆశావహుల ప్రదక్షిణలు సైతం ప్రారంభమయ్యాయి. మైనార్టీ కోటాలో 2 స్థానాలకు, ప్రజా ప్రతినిధులు, రిటైర్డ్ గెజిటెడ్ కోటలో మరో 2 స్థానాలకు కో ఆప్షన్ సభ్యులను ఎంపిక చేయనున్నారు. మైనారిటీ కోటాలో కో ఆప్షన్ కోసం మహ్మద్ అలీ, అబ్దుల్ నబీ,ఎం డి సమీర్, మున్నీర్, జావేద్ , పోటీలో ఉండగా ప్రజాప్రతినిధుల కోటాలో మాజీ వైస్ ఛైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, మాజీ వార్డ్ సభ్యులు ఎడ్ల శ్రీనివాస్, అవిశెట్టి స్వామి, బుంగపట్ల యాకయ్య, మాజీ కౌన్సిలర్లు కారుపోతుల శిరీష, లెంకల సుజాత, మాజీ కో ఆప్షన్ సభ్యురాలు పోలినేని ఆనందమ్మ, మాజీ ఎంపీటీసీ ముద్దం జయశ్రీ రిటైర్డ్ గెజిటెడ్ కోటాలో మన్నే అంజయ్యలు పోటీలో ఉన్నారు.

**అధిష్టానం ఆశీస్సులు ఎవరికి దక్కేనో.....? .**

కో ఆప్షన్ పదవి కోసం ఆయా కేటగిరీలలో పదవులు దక్కించుకునేందుకు ఆశావహులు ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ,కౌన్సిలర్లు, ముఖ్య నాయకులను స్వయంగా కలిసి తమ ఎన్నికకు సహకరించాలని వారిని ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. కానీ... కాంగ్రెస్ పార్టీ అధిష్టానం మున్సిపల్ ఎన్నికల వేళ కొంతమందికి కో ఆప్షన్ పద వులను ఆశ చూపి పోటీ నుండి తప్పించారని వారికి కో ఆప్షన్ ఇవ్వాలని,కాంగ్రెస్ పార్టీకి కట్టుబడి ఉన్న వాళ్ళకే ఇవ్వాలని. పలువురు కోరుతున్నారు. రానున్న రోజుల్లో ఈ కో..ఆప్షన్ పదవులు ఎవరికి దక్కుతుందో వేచి చూడాల్సిందే.

# అగ్ని ప్రమాదాలపై అవగాహన



మోత్కూరు, ఏప్రిల్ 16 (వార్త వేదిక సూర్య ): అగ్ని ప్రమాదాలు జరగకుండా ఏలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో గృహ సముదాయలకు అగ్నిమాపక కేంద్ర వారోత్సవాలలో భాగంగా ఆ శాఖ సిబ్బంది గురువారం మోత్కూరు పట్టణ వాసులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్ర సిబ్బంది జి. రవీందర్, ప్రభు జ్యోతి, రామకృష్ణ , సిద్ధిక్ అర్వపల్లి తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలుచేయడంలో ఆలస్యం చేయడం తగదు

మోత్కూరు, ఏప్రిల్ 16 (వార్త వేదిక సూర్య ): మోత్కూరు వ్యవసాయ మార్కెట్ లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే సామేల్ ప్రారంభించి వారం రోజులు కావొస్తున్న నేటికీ రైతుల వద్ద ఒక్క బస్తా కూడా క్వాంట వేయలేదని మాజీ మార్కెట్ కమిటీ కొణతం యాకుబ్ రెడ్డి అన్నారు.గురువారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని మిల్లర్స్ తో మాట్లాడకుండా లారీలకు ట్యాగింగ్ చేయకుండా కాలయాపన చేయడంతో దళారులు చేతుల్లో రైతులు మోసపోయే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.ధాన్యం కొనుగోలు విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే చేసే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# వసంతకు ఘన నివాళి



మోత్కూరు, ఏప్రిల్ 16 (వార్త వేదిక సూర్య ) మోత్కూరు మున్సిపల్ పరిధిలోని జామ చెట్లబావి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు బీసు భాష సతీమణి వసంత ఇటీవల అకాల మృతిచెందారు. గురువారం వసంత దశదినకర్మ కు మండల కాంగ్రెస్ నాయకులు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ నూనెముంతల విమల వెంకటేశ్వర్లుగౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గుండగోని రామచంద్రు గౌడ్ నాయకులు పట్టూరి అంజయ్య, పైళ్ల నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం



మోత్కూరు, ఏప్రిల్ 16 ( వార్త వేదిక సూర్య ); ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని మోత్కూరు మండల ప్రత్యేక అధికారి గుర్రం సురేష్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా మండల స్థాయి సభ ఎంపీడీవో బాలాజీ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ ప్రజా పాలన ప్రణాళిక కార్యచరణ అన్ని గ్రామాలలో సజావుగా నడుస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అల్పాహారం, కళాశాల విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన వివిధ మండల స్థాయి అధికారులు తమ నివేదికను వివరించారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ పి.జ్యోతి,ఎంపీఓ జనార్దన్ రెడ్డి ,సి.ఐ. సి.వెంకటేశ్వర్లు ,ఏవో వద్దేమాన్ కీర్తి , పి. హెచ్.సి. వైద్యాధికారి హేమంత్ కుమార్, విద్యుత్ ఏఈ ప్రభాకర్ రెడ్డి, మిషన్ భగీరథ ఏఈ పి.అనూష, సిడిపిఓ యామిని, ఏపిఎం పక్కీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# మోత్కూరు నుండి హైదారాబాద్‌కు బస్సులను నడిపించాలి



మోత్కూరు, ఏప్రిల్ 16, (వార్త వేదిక సూర్య ): మోత్కూరు నుండి హైదారాబాద్ కు ఆర్టీసీ బస్సులను నడిపించాలని స్వేరో నెట్వర్క్ జిల్లా అధ్యక్షులు ఎర్రవెల్లి నర్సయ్య ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఈ మేరకు మోత్కూరు ఈ బస్సులను నడిపించాలని కోరుతూ నల్లగొండ ఆర్. ఎం.కార్యాలయంలో ఆర్. ఎం. జాన్ రెడ్డి కి స్వేరో ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ తొర్రూరు, సూర్యాపేట డిపోల నుండి హైదారాబాద్ కు బస్సులు వస్తున్నప్పటికీ ఆ బస్సులలో తిరుమలగిరిలోనే ప్రజలు అధిక సంఖ్యలో వెళ్తున్నారని, మోత్కూరు, అడ్డగూడూరు, గుండాల ఆత్మకూరు (ఎం) మండలాల ప్రజలకు ఈ బస్సులలో సీట్లల్లో కూర్చోలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. బస్సులలో సీట్లు లేకపోవడం వల్ల ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించవల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా మోత్కూరు నుండి హైదారాబాద్ కు ప్రత్యేకంగా అధిక బస్సులను నడిపించాలని ఆర్. ఎం కు కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు నర్సయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వేరో కమిటి సభ్యులు పి రాములు, ఎస్ కె రసూల్, శివ, వినయ్ కుమార్, గజ్జెల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.



ఉత్తరప్రదేశ్ హోమ్ మినిస్టర్ ధర్మవీర్ ప్రజాపతి ని మర్యాదపూర్వం కలిసిన మహేశ్వరం మండల సిరిగిరి పురం గ్రామ మాజీ సర్పంచ్ కాసుల సురేష్,
మహేశ్వరం ఏప్రిల్ 16 వార్త వేదిక సూర్య

# ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు

**చిన్న అంజయ్య ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి ముగ్గు పోసిన గ్రామ సర్పంచి ఒక్కని లక్ష్మమ్మ**



మహేశ్వరం ఏప్రిల్ 16 వార్త వేదిక సూర్య: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం కల్వకోల్ గ్రామంలో అర్హత గల చిన్న అంజయ్యకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం దీనికి గ్రామ సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ , ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఉప సర్పంచ్ జనార్దన్ గౌడ్,వార్డ్ సభ్యులు అందరూ కలిసి ఇందిరమ్మ ఇంటికి ముగ్గు పోయడం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, సాయిని గోపాల్ రెడ్డి, అరటి కుమార్, తిరుమల యాదయ్య, జంపుల భారతమ్మ, గ్రామ పెద్దలు,

పులిమామిడి లక్ష్మీనారాయణ గౌడ్,బక్కని రవి మాదిగ, అరటి వెంకటేష్, గుర్రంపల్లి నరసింహ, రామచంద్రి, లబ్ధిదారుడు అరడి చిన్న అంజయ్య, లక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికులకు రుణమాఫీని పూర్తి స్థాయిలో అమలు చేయాలి

- చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు శాంతికుమార్



మోత్కూరు, ఏప్రిల్ 16 (వార్తా వేదిక సూర్య ): .చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వ ఇచ్చిన హామీని వేలాది మందికి అమలైనప్పటికీ కొన్ని సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీ నోచుకోలేని చేనేత కార్మికులకు లక్ష రూపాయల రు-ణమాఫీని వెంటనే అమలు చేయాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు వనం శాంతి కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఈ మేరకు ఆ సంఘం గౌరవ అధ్యక్షులు చెరుపల్లి సీతారాములులతో కలిసి హైదరాబాద్ లో చేనేత జౌళిశాఖ కార్యాలయంలో ఆ శాఖ కమీషనర్ శైలజ రామయ్యర్ కు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా శాంతి కుమార్ మాట్లాడుతూ చేనేత మగ్గాలపై వివిధ బ్యాంకు నుండి కార్మికులు రుణాలు తీసుకున్నారని ధ్రువీకరణ చేసిన అధికారులు అంగీకరించకపోవడంతో ఈ రుణమాఫీ జరగటం లేదన్నారు. యాదాద్రి జిల్లా వ్యాప్తంగా. 60 మంది ఉండగా అందులో మోత్కూరుకు చెందిన 14 మంది చేనేత కార్మికులు రుణమాఫీకి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పున: పరిశీలించి రుణమాఫీ నోచుకోలేని చేనేత కార్మికులను రుణమాఫీ అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.







Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**, and **Printed at SURYA DIGITAL PRINTERS**, H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252. **Editor: POLOJU SRINIVASA CHARY. PRGI.NO:- TGTEL/25/A0305**, Cell:9985389183. **EmailId:vaarthavedhikasurya2025@gmail.com**